# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 13 సంచిక : 44 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 18 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :44 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 18 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## మున్సిపల్ పోరు: టీడీపీ రెండో జాబితా విడుదల.. మచిలీపట్నం మేయర్ అభ్యర్థి ఖరారు

- ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల కోసం టీడీపీ నుంచి మరో జాబితా
- మొత్తం 22 మంది అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటించిన పార్టీ
- మచిలీపట్నం మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబిదా పేరు ఖరారు
- జాబితాలో 21 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల చైర్‌పర్సన్ అభ్యర్థులు
- తొలి జాబితాలో ఇప్పటికే 36 మందిని ప్రకటించిన టీడీపీ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో టీడీపీ తన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా 22 మందితో కూడిన రెండో జాబితాను శనివారం అధికారికంగా విడుదల చేసింది. మచిలీపట్నం కార్పొరేషన్ మేయర్ అభ్యర్థితో పాటు 21 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చైర్‌పర్సన్ అభ్యర్థుల పేర్లను

- మిగతా 2లో



## నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం...
# గెట్ రెడీ!

- ఏపీలో టీడీపీ, వైసీపీ మధ్య సివిల్ వార్ నడుస్తోందన్న విజయసాయిరెడ్డి
- పుంగనూరు, తాడిపత్రి ఘటనలను ప్రస్తావిస్తూ రెండు కుటుంబాలపై ఫైర్
- 'రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప' అంటూ రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలపై ఆందోళన
- రెండు పార్టీలకు గుణపాఠం చెప్పే మూడో ప్రత్యామ్నాయం రావాలన్న విజయసాయి
- నవంబర్ రెండో వారంలో కలుద్దామని, జెన్-జీ సిద్ధంగా ఉండాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్: ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీల మధ్య పౌర యుద్ధం (సివిల్ వార్) నడుస్తోందని, రెండు కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. గత రెండు రోజులుగా పుంగనూరు, రాయచోటి, తాడిపత్రి, ఆళ్లగడ్డ వంటి పట్టణాల్లో జరుగుతున్న హింసాత్మక ఘటనలను విజయసాయిరెడ్డి తన పోస్టులో ప్రస్తావించారు. "రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప రాజకీయం నడుస్తోంది. చంద్రబాబు, జగన్ కుటుంబాల మధ్య, ఆ రెండు కుల, మైనారిటీ కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఓ సివిల్ వార్ నడుస్తోంది" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంత దారుణంగా ఉన్నాయో

- మిగతా 2లో



# ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం...
## చంద్రబాబు, పవన్‌తో వేర్వేరుగా భేటీ

- ఏపీలో పర్యటించిన మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్
- సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ
- మంగళగిరిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సమావేశం
- పులుల సంరక్షణ, అడవి దున్నల తరలింపుపై ఇరువురి మధ్య చర్చ
- త్వరలో మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని తెలిపిన పవన్ కల్యాణ్



పెన్ పవర్ డెస్క్:మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ శనివారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ముందుగా ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లిన మోహన్ యాదవ్, ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం నివాసానికి వచ్చిన ఆయనకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు.

- మిగతా 2లో



## పులివెందులలో కాల్పులు.. నామినేషన్ల వేళ తీవ్ర ఉద్రిక్తత

- పులివెందులలో స్థానిక ఎన్నికల నామినేషన్ల వద్ద ఉద్రిక్తత
- వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య తోపులాట
- జనాన్ని చెదరగొట్టేందుకు గాల్లోకి పోలీసుల కాల్పులు
- ఆరు రౌండ్లు కాల్పులు జరిపినట్లు సమాచారం
- ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:కడప జిల్లా పులివెందులలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు గాల్లోకి ఆరు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటనతో పులివెందులలో

- మిగతా 2లో

## ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు: టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్

- టీడీపీ, వైసీపీలది ప్రతీకార రాజకీయమన్న షర్మిల
- స్థానిక ఎన్నికల్లో హింసపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- ఎన్నికల సంఘం, పోలీసుల తీరుపై ప్రశ్నలు
- స్వేచ్ఛాయుత ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్

- మిగతా 2లో





## ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం కుప్పకూలిపోయింది.. కత్తులు, కర్రలతో మా వాళ్లను వెంటాడుతున్నారు

- రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్
- నామినేషన్ల ప్రక్రియలో టీడీపీ గూండాయిజం చేస్తోందని ఆరోపణ
- పోలీసుల సమక్షంలోనే ఎంపీలపై దాడులు జరిగాయని వెల్లడి
- చంద్రబాబు పాలనలో జంగిల్‌రాజ్ నడుస్తోందని విమర్శ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం పూర్తిగా కుప్పకూలిపోయిందని, ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార తెలుగుదేశం పార్టీ హింసకు పాల్పడుతోందని ఆరోపిస్తూ, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు.

- మిగతా 2లో

## దాండియా సంబరాల్లో అపశృతి: విద్యార్థిని దుర్మరణం..
# ఐదుగురి పరిస్థితి విషమం

- ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ దాండియా వేడుకల్లో భారీ ప్రమాదం
- లైటింగ్ స్టాండ్ విద్యార్థులపై కూలడంతో వనపర్తికి చెందిన సోనీ అనే విద్యార్థిని మృతి
- సుమారు 25 మంది విద్యార్థులకు గాయాలు.. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం
- ఈదురుగాలుల కారణంగానే లైటింగ్ క్రేన్ అదుపుతప్పి కూలినట్లు ప్రాథమిక అంచనా
- ప్రమాదంపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం



పెన్ పవర్ డెస్క్: హైదరాబాద్‌లోని నాదర్‌గుల్ ప్రాంతంలో ఉన్న ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాలేజీలో నిర్వహిస్తున్న 'సంగమం–2026' టెక్నికల్ మరియు కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన దాండియా వేడుకల్లో విషాదం నిండింది.

- మిగతా 2లో

## నేటి నుంచి వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ



- ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక
- ఉత్తర తమిళనాడు తీరంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- హైదరాబాద్ సహా అనేక జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ

పెన్ పవర్ డెస్క్:తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది.ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది.

- మిగతా 2లో

## సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు షరతులతో బెయిల్

- నిరసన యాత్రకు ముందు దీప్కేను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- బెయిల్ ఇచ్చిన మందిర్ మార్గ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు
- రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశం
- ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని షరతు
- కన్నాట్ ప్లేస్‌లో నిరసన యాత్రకు అనుమతి నిరాకరించిన పోలీసులు



పెన్ పవర్ డెస్క్:కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు న్యూఢిల్లీలోని మందిర్ మార్గ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు శనివారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించిన న్యాయస్థానం, ఆయన విడుదలకు మార్గం సుగమం చేసింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126, 170 ప్రకారం, ఏడాది పాటు శాంతిభద్రతలకు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# రెయిన్ డేస్...

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో రాబోయే రోజుల్లో వానలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో నేడు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో వానలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే తేలికపాటి వానలు పడతాయని, మోస్తరు వానలు తప్పించి భారీ వర్షాలు పడవని వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని చోట్ల బలమైన ఈదురుగాలులు వీస్తాయని, గంటలకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశముందని కూడా వాతావరణ శాఖ వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ పేర్కొంది. రానున్న నాలుగు రోజుల పాటు వానలు పడతాయని తెలిపింది.

**అక్కడకక్కడ తెలంగాణలో వానలు...**

తెలంగాణలో నేడు అక్కడకక్కడ వానలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు వీస్తాయని, పిడుగులు పడతాయని చెప్పింది. కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన ఉరుములు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా పెద్దపల్లి, భూపాలపల్లి, సిద్దిపేట, వరంగల్, రంగారెడ్డి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది. హైదరాబాద్ లోపగటి ఉష్ణోగ్రతలు కొంత ఎక్కువగా నమోదయినా, రాత్రి వేళ వాతావరణం చల్లబడే అవకాశముందని తెలిపింది. పగటిపూట ఉష్ణోగ్రతలు సుమారు 31 డిగ్రీల నుంచి 33 డిగ్రీల వరకు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు.

**ఏపీలో ఉరుములు, మెరుపులతో ...**

ఆంధ్రప్రదేశ్ లో వాతావరణం పై అమరావతి వాతావరణ శాఖ కీలక అప్ డేట్ ఇచ్చింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమల్లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు లేదా పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. అమరావతి, విజయవాడ, తిరుపతి వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 30డిగ్రీల నుంచి 31 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రధానంగా రైతులు, పశువుల కాపర్లు పొలాల్లోకి వెళ్లినప్పుడు చెట్ల కింద, విద్యుత్తు స్థంభాల కింద నిలబడవద్దని కూడా వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు: టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్

టీడీపీ, వైసీపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు దాష్టీక రాజకీయాలు చేస్తూ, ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నాయని ఆరోపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మరో 'సౌత్ బీహార్'గా మార్చే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాయచోటి, పుంగనూరులో జరిగిన ఘర్షణలు రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఆందోళనకరమైన పరిణామాలని షర్మిల అన్నారు. ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలను ఘర్షణలు, దాడులతో రణరంగంగా మారుస్తున్నారని విమర్శించారు. "కూటమిది నిజంగా పవిత్ర పాలనే అయితే దాడులు ఎందుకు? బలవంతపు ఏకగ్రీవాలు ఎందుకు? నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడమెందుకు?" అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. నాడు వైసీపీ హయాంలో హింసాకాండ జరిగితే, నేడు టీడీపీ హయాంలో అంతకుమించిన ఘోరాలు జరుగుతున్నాయని ఆమె పోల్చారు. నామినేషన్ కేంద్రాల వద్ద గూండాలు స్వైరవిహారం చేస్తుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు ఎందుకు విఫలమవుతున్నారని షర్మిల నిలదీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ సాగిస్తున్న ఈ దౌర్జన్య వైఖరిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు రాజకీయాలకు,
రక్తపాతానికి తావులేదని, అభివృద్ధి కోసం పోటీ పడాలి కానీ భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి
ఆమె పలు డిమాండ్లు చేశారు. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నామినేషన్ వేసేలా చూడాలని, బలవంతపు ఏకగ్రీవాలను అడ్డుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ కావాలి కానీ, పగలు ప్రతీకారాలకు వేదిక కాకూడదని ఆమె పేర్కొన్నారు.

# మున్సిపల్ పోరు: టీడీపీ రెండో జాబితా విడుదల.. మచిలీపట్నం మేయర్ అభ్యర్థి ఖరారు

- మొదటి పేజి తరువాయి

ఈ జాబితాలో ఖరారు చేసింది. పార్టీ జాతీయ కార్యాలయం నుంచి ఈ ప్రకటన వెలువడింది. ఇటీవలే 36 మందితో తొలి జాబితాను ప్రకటించిన టీడీపీ, తాజాగా రెండో జాబితాను విడుదల చేయడంతో ఎన్నికల బరిలో దూకుడు పెంచినట్లయింది. ఈ జాబితాలో కీలకమైన మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబిదాను ఎంపిక చేసింది. క్షేత్రస్థాయిలో పార్టీ అభిప్రాయాలు, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అభ్యర్థులను ముందుగానే ప్రకటించడం ద్వారా వారికి ప్రచారానికి తగినంత సమయం ఇవ్వడంతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు టీడీపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ రెండు జాబితాలతో కలిపి టీడీపీ ఇప్పటివరకు మొత్తం 58 స్థానాలకు తమ అభ్యర్థులను ప్రకటించినట్లయింది.

**ఖరారైన అభ్యర్థుల పూర్తి జాబితా:**

మున్సిపల్ కార్పొరేషన్ (1):
మచిలీపట్నం: షేక్ అబ్దుల్ అబిదా
మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీలు (21):
ఆకివీడు: నిలోఫర్ షేక్
బేతంచెర్ల: ఐ. లోకేశ్ గౌడ్
చీరాల: యెరిచర్ల హనీ స్పందన
బుచ్చిరెడ్డిపాలెం: దొడ్ల విజయలక్ష్మి
డోన్: కోట్ల సుజాతమ్మ
గుత్తి: గోవిందరాజులు తమిళ్ సెల్వి
గుంతకల్లు: యశోద
జంగారెడ్డిగూడెం: రొంగల అనుష
కదిరి: షేక్ సమీరా
కళ్యాణదుర్గం: బుట్న లక్ష్మి
కొండపల్లి: కన్నెకంటి అమూల్య
కొవ్వూరు: జొన్నలగడ్డ రాధారాణి
నాయుడుపేట: షకీరా
నందిగామ: శాకమూరి వంశీధర్
నందికొట్కూరు: ఈ.ఎం. సబురున్నిసా
నర్సీపట్నం: చింతకాయల పద్మావతి
ప్రొద్దుటూరు: నంద్యాల రాఘవరెడ్డి
వెంకటగిరి: దొంతు శారద
ఉయ్యూరు: చేదుర్తిపాటి ప్రవీణ్ కుమార్
ఏలేశ్వరం: యార్లగడ్డ అక్షిత
ఎమ్మిగనూరు: మాచాని సునీత

ఈ జాబితాలో మహిళలకు, యువతకు ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మున్సిపాలిటీలకు అభ్యర్థులను ప్రకటించడం ద్వారా అన్ని ప్రాంతాల్లో ఎన్నికలకు సిద్ధమవుతున్నామనే సంకేతాలను పార్టీ పంపింది. మిగిలిన స్థానాలకు కూడా త్వరలోనే అభ్యర్థులను ఖరారు చేసి, పూర్తిస్థాయిలో ఎన్నికల ప్రచారంలోకి దిగాలని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది.

### దాండియా సంబరాల్లో అపశృతి: విద్యార్థిని దుర్మరణం..

# ఐదుగురి పరిస్థితి విషమం

- మొదటి పేజి తరువాయి

వేడుకల కోసం ఏర్పాటు చేసిన భారీ ఇనుప విద్యుత్ దీపాల స్టాండ్ ఒక్కసారిగా విద్యార్థులపై కుప్పకూలింది. ఈ ప్రమాదంలో వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఆమెతో పాటు మరో 25 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో మృతురాలి సోదరితో సహా ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది బాధితులను ఎల్‌బీ నగర్‌లోని కామినేని ఆసుపత్రికి, అలాగే అదభట్లలోని ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. భారీ ఈదురుగాలుల కారణంగానే లైటింగ్ క్రేన్ అదుపుతప్పి కూలిపోయినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. స్టాండ్ కూలిన సమయంలో మంటలు
కూడా చెలరేగడంతో విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

# ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం కుప్పకూలిపోయింది.. కత్తులు, కర్రలతో మా వాళ్లను వెంటాడుతున్నారు

- మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు తన పార్టీ కార్యకర్తలకు గూండా లైసెన్స్‌లు ఇచ్చి, వారికి అండగా పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటున్నారని జగన్ ఆరోపించారు. "రాజకీయ హింసావాదిగా తన చరిత్రను మరోసారి చాటుకుంటూ రాష్ట్రంలో జంగిల్‌రాజ్‌ను నడిపిస్తున్నారు. ప్రతిపక్ష అభ్యర్థులు కనీసం నామినేషన్లు కూడా వేయలేని దుస్థితి సృష్టించారు" అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు. వైసీపీ అభ్యర్థులను పోలీసుల సమక్షంలోనే కత్తులు, కర్రలతో వెంటాడుతున్నారని, నామినేషన్ పత్రాలను లాక్కుని చించివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వేళ అభ్యర్థులను పోలీసులు అక్రమంగా ఎత్తుకెళుతున్నారని, ఇదే చంద్రబాబు మార్కు ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. ఈ దాడుల్లో తమ పార్టీకి చెందిన ముగ్గురు ఎంపీలు కూడా బాధితులయ్యారని జగన్ తెలిపారు. అభ్యర్థులకు ప్రపోజర్లుగా వెళ్లిన ఎంపీలపై పోలీసుల సమక్షంలోనే దాడులు జరిగాయని, వారి చేతుల్లోంచి నామినేషన్ పత్రాలు లాక్కుని చించేశారని వివరించారు. "ఎంపీలకే రక్షణ లేని రాష్ట్రంలో సామాన్యుల పరిస్థితి ఏమిటి?" అని నిలదీశారు. కడప, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, రాయచోటి, పుంగనూరు, తిరుపతి, దర్శి, గురజాల సహా రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, ఇవి చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం ఎంతగా దిగజారిపోయిందో చూపుతున్నాయని అన్నారు. పులివెందులలో పోలీసులు జరిపిన కాల్పులు ప్రజాస్వామ్యంపై పేల్చిన తూటాలని, దీని వెనుక చంద్రబాబు కుట్ర ఉందని జగన్ ఆరోపించారు. నామినేషన్ వేయడానికి వచ్చిన వారిపై పోలీసులు ఎందుకు దాడి చేశారని, ఎందుకు కాల్పులు జరిపారని ప్రశ్నించారు. "నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడం ఎన్నికలా? ప్రతిపక్ష అభ్యర్థులను పోలీసులతో ఎత్తుకెళ్లడం ప్రజాస్వామ్యమా? ఎంపీలపైనే దాడులు చేయించడం రాజ్యాంగ పాలనా?" అని చంద్రబాబును ఉద్దేశించి జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు.

రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ఈ పరిస్థితుల్లో కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "సూపర్ 6, సూపర్ 7ల మోసాలతో ప్రజలకు బాండ్లు ఇచ్చి మరీ మోసం చేసిన ఈ వెన్నుపోటు పార్టీ నుంచి ఇంతకన్నా ఏమి ఆశించగలం!" అని జగన్ తన పోస్టును ముగించారు.

# సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు షరతులతో బెయిల్

- మొదటి పేజి తరువాయి

విఘాతం కలిగించకూడదన్న షరతుకు ఆయన కట్టుబడి ఉండాల్సి ఉంటుంది.

ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో సీజేపీ తలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' నిరసన యాత్రకు ముందు, శుక్రవారం ఢిల్లీ పోలీసులు ఆయనను ముందుజాగ్రత్త చర్యగా అదుపులోకి తీసుకున్నారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126, 170 కింద ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నిరసన యాత్రకు ముందు సుమారు 20 మందికి పైగా పోలీసులు దీప్కే నివాసానికి వెళ్లి ఆయనకు రెండు నోటీసులు అందజేశారు. కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించడం వల్ల తొక్కిసలాట జరిగే అవకాశం ఉందని, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడే ప్రమాదం ఉన్నందున అక్కడ నిరసనలు చేపట్టరాదని ఒక నోటీసులో పేర్కొన్నారు. గతంలో సమర్పించిన బాండ్ షరతులను ఉల్లంఘిస్తున్నారని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జారీ చేసిన రెండో నోటీసులో పోలీసులు హెచ్చరించారు.

అక్టోబర్ 10న కూడా దీప్కే, ఆయన సహచరులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు ముందుజాగ్రత్తగా అదుపులోకి తీసుకున్నారు. ఏడాది పాటు శాంతియుతంగా
ఉంటామని హామీ ఇస్తూ, ఒక్కొక్కరు రూ. 50,000 పూచీకత్తు సమర్పించి వారు విడుదలయ్యారు. సీజేపీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో 'లెహ్రా దో తిరంగా' యాత్రను నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నందున, ఢిల్లీ పోలీసులు ఈ యాత్రకు అనుమతి నిరాకరించారు.

## ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం...

- మొదటి పేజి తరువాయి

అనంతరం నేతలు కాసేపు ముచ్చటించారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌తో మోహన్ యాదవ్ సమావేశమ య్యారు. ఈ భేటీలో ఏపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల కు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో పులుల సంరక్షణ చర్యలను బలోపేతం చేయడంపై మాట్లాడారు. అలాగే, జీవవైవిధ్య పరిరక్షణలో భాగంగా మధ్యప్రదేశ్ నుంచి గౌర్ (అడవి దున్నలు)ను చీూ=కు తరలించే ఒప్పందాన్ని వేగవంతం చేయాలని పవన్ కల్యాణ్ కోరారు. ఈ సందర్భంగా త్వరలోనే తాను మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని పవన్ తెలిపారు. సమావేశం అనంతరం పవన్ కల్యాణ్.. మోహన్ యాదవ్‌ను ఉప్పాడ పట్టు శాలువాతో సత్కరించి, కొండపల్లి, శ్రీకాళహస్తి కళాకృతులతో పాటు అరకు కాఫీని బహూకరించారు. ప్రతిగా మోహన్ యాదవ్, శ్రీ ఓంకారేశ్వర స్వామి ప్రతిమను, జ్యోతిర్లింగ క్షేత్ర ప్రసాదాన్ని పవన్‌కు అందజేశారు.

# పులివెందులలో కాల్పులు.. నామినేషన్ల వేళ తీవ్ర ఉద్రిక్తత

- మొదటి పేజి తరువాయి

ఒక్కసారిగా కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల కోసం పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అయితే, అప్పటికే అక్కడ ఉన్న టీడీపీ నేతలను ముందుగా లోపలికి అనుమతిస్తామని పోలీసులు చెప్పడంతో వివాదం మొదలైంది. పోలీసుల నిర్ణయంతో ఆగ్రహించిన వైసీపీ కార్యకర్తలు ఒక్కసారిగా ముందుకు దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ తోపులాట జరిగింది. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో గుంపును చెదరగొట్టి, శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య నెలకొన్న తీవ్రమైన రాజకీయ పోటీయే ఈ ఉద్రిక్తతలకు కారణమని తెలుస్తోంది. ఘటన అనంతరం పులివెందులలో భారీగా పోలీసులను మోహరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టారు.

# నేటి నుంచి వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

- మొదటి పేజి తరువాయి

దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. రేపు (అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

# నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!

- మొదటి పేజి తరువాయి

ఈ ఘటనలే నిదర్శనమని అన్నారు. కర్రలు, కత్తులు, గూండాలు, బౌన్సర్లు, నామినేషన్లు చించివేయడం, జీపులతో ఢీకొట్టడం, నెత్తురోడేలా దాడులు చేసుకోవడం వంటి దృశ్యాలు దేశవ్యాప్తంగా రాష్ట్ర పరువును తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదే అరాచకం కొనసాగితే, 2029 నాటి సాధారణ ఎన్నికల్లో ఈ పార్టీలు నేరుగా బందిపోట్లకు, హత్యలు, మానభంగాలు, దొంగతనాల చరిత్ర ఉన్నవారికే టికెట్లు ఇచ్చే పరిస్థితి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని, ఒక మూడో ప్రత్యామ్నాయంతో సరికొత్త రాజకీయానికి యువత (జెన్-జీ) నడుం బిగించాలని పిలుపునిచ్చారు. "ఈ అరాచకం ఇకమీదటా కొనసాగాలా? లేక, ఈ రెండు పార్టీలకు గుణపాఠం నేర్పాలా? అన్నది నిర్ణయించుకోవాలి. నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!" అంటూ తన పోస్టును ముగించారు.

# భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ తల్లి సారె ఊరేగింపు!

* భజనలు, నైవేద్యాలతో ఆధ్యాత్మిక సందడి

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 17:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం ధారకొండ గ్రామంలో దేవీ నవరాత్రుల సందర్భంగా దుర్గమ్మ తల్లి సారె ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ధారకొండ ప్రాంతానికి చెందిన భక్తులు అమ్మవారికి నైవేద్యాలు, వివిధ తినుబండారాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం సంప్రదాయబద్ధంగా నిర్వహించిన సారె ఊరేగింపు గ్రామ వీధుల్లో భక్తి వాతావరణాన్ని నింపింది. భజనలు, అమ్మవారి నామస్మరణల మధ్య భక్తులు సారేను ఊరేగిస్తూ వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ధారకొండ ప్రాంత భక్తులతో పాటు భవానీ మాలలు ధరించిన యువకులు పాల్గొని అమ్మవారికి భక్తిపూర్వకంగా పూజలు నిర్వహించారు.



# పెన్ పవర్ ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# పెన్ పవర్ కథనంతో దందాల విలేకర్ల గుండెల్లో రైలు






* అంతర్మథన రక్షణకై సంఘ నేతలతో చర్చలు...?
* పెన్ పవర్ దిన పత్రిక పై ప్రశంసలు

**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 17:** విలేకర్ల ముసుగులో దందాలు...? అనే శీర్షికతో శనివారం పెన్ పవర్ దిన పత్రికలో ప్రచురితమైన వార్త కథనం పాఠకులకు తెలిసిందే....! ఈ కథనంతో పాడేరు పట్టణం లో ప్రకంపనలు మొదలైంది. పలు గ్రూప్ మాధ్యమాల్లో తెగ వైరల్ కావడంతో బారీగా చర్చలు జరిగింది.. పెన్ పవర్ దిన పత్రిక కు పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. మరో వైపు పెన్ పవర్ కథనంతో ఎటు నుండి ప్రమాదాలు ముంచుకొస్తుందోనని దందాల విలేకర్ల గుండెల్లో రైలు పరిగెడుతుంది. గత్యంతరం లేక కొంతమంది దందా విలేకర్లు అంతర్మథన రక్షణకై సంఘ నేతలతో చర్చలు...?జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం...? సంఘం నేతలు సహకరిస్తే పెన్ పవర్ విలేకరి నిలదీయాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నప్పటికీ సంఘం నేతలు ససేమిరా అనడంతో అదికాస్తా బెడిసికొట్టడంతో కంగు తిన్నారు. సంఘం ఈ విషయంలో వెనకేసి వచ్చే ప్రసక్తే లేదని తెగేసి చెప్పడంతో ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుని లబో దిబో అనట్లు కుడితిలో పడ్డ ఎలుక లాగా కొట్టుమిట్టుతున్నట్లు సమాచారం.. సంఘానికి పెన్ పవర్ దిన పత్రికలో ఎక్కడ ఏ జర్నలిస్టు సంఘం పేరు పెట్టీ వార్త కథనం ప్రచురించలేదని అటువంటి అప్పుడు సంఘం ఎలా పెన్ పవర్ దిన పత్రిక జర్నలిస్టు పై నిలదీస్తామని.. ఎవరైతే తప్పు చేశారో వారిని దృష్టిలో పెట్టుకొని వార్త కథనం వచ్చింది తప్పు చేసినా వారికి వర్తిస్తుంది అని చెప్పడంతో ఏం చేయాలో పాల్ పోల్ లేదు అంటే గుమ్మడి కాయలు దొంగలు కొట్టుకు పోయారంటే భుజాలు తడుము కొన్న చందంగాఉంది..నిజంగా దందా (తప్పు) చేయక పోతే సంఘం నేతలను అడ్డం పెట్టుకునీ వారి సహకరంతో పెన్ పవర్ దిన పత్రిక జర్నలిస్టు పై నిలదీస్తామని ఎలా అనుకున్నారో దీని బట్టి జనాలు అర్థం చేసుకోవాలనీ పెన్ పవర్ దిన పత్రిక జర్నలిస్టు రమణ పాడేరు పట్టణ ప్రాంత ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా విలేకర్ల ముసుగులో దందాలు అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి పోలీసులు, జిల్లా కలెక్టర్ ఎటువంటి చర్యలకు ఆదేశాలు జారీ చేస్తారో లేదో వేచి చూడాల్సిన అవసరం ఉంది...

# టికెట్ ఎవరికి వచ్చినా ఒక్కటే మాట.. పార్టీ గెలుపే మా బాట!

## జీకేవీధి వైఎస్సార్‌సీపీ నేతల స్పష్టీకరణ.. అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రకటన



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 17:** గూడెం కొత్తవీధి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే తమకు శిరోధార్యమని ఆ పార్టీ ముఖ్య నాయకులు స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తారని తెలిపారు. శనివారం నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ, పార్టీలో సీనియర్, జూనియర్ అనే తేడాలు లేవని, అందరూ ఒకే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు అధిష్ఠానం ఎవరికి అవకాశం కల్పించినా, మిగిలిన నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేసి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.వ్యక్తిగత అభిప్రాయాల కంటే పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తామని, అధిష్ఠానం నిర్ణయాలకు కట్టుబడి ఉంటామని తెలిపారు. పార్టీలో విభేదాలు ఉన్నాయంటూ జరుగుతున్న ప్రచారంపై స్పందిస్తూ, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్, మాజీ ఎంపీపీ బోయిన కుమారి, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు వనపల రాజేష్, ఉపాధ్యక్షుడు వంతల అరుణ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, మాజీ సర్పంచ్ కంకిపాటి వీరేంద్ర ప్రసాద్, మాజీ ఎంపీటీసీలు సత్యనారాయణ, రాజులమ్మ, మాజీ వైస్ ఎంపీపీ దేవుడు, నాయకులు అరికట్ట అంజి, నారాయణ, లొంజా గణపతి, పాతును లక్ష్మణ్, రామలింగం, రామ్మూర్తి చందు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్లక్ష్యం

* కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును సరికాదు.
* కాంగ్రెస్ పార్టీ ఆదివాసి రాష్ట్ర వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 17.** గిరిజన రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదని, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఆదివాసి రాష్ట్ర వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. 17 ఎంపిటిసి స్థానాలు అన్-రిజర్వ్ డ్ ను పునఃపరిశీలించాలనీ డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లాలో 172 ఎంపిటిసిలలో 17 స్థానాలను అన్-రిజర్వ్ డ్ గా ప్రకటించడం గిరిజనుల రాజకీయ ప్రాతినిధ్యంపై దెబ్బగా పేర్కొన్నారు. ఇది 5వ షెడ్యూల్, పెసా చట్టానికి విరుద్ధమని, ప్రభుత్వం తక్షణమే దీన్ని పునఃపరిశీలించి, గిరిజనుల రాజ్యాంగ హక్కులకు భంగం కలగకుండా చూడాలన్నారు.

**కూటమి గిరిజన నాయకులు మౌనం వీడాలి**

గిరిజనుల ఓట్లతో గెలిచిన తెలుగుదేశం, జనసేన, బీజేపీల గిరిజన నాయకులు ఈ అన్యాయాలపై ఎందుకు మౌనంగా ఉన్నారని, పార్టీలకు అతీతంగా తమ జాతి హక్కుల కోసం నిలబడాలన్నారు. గిరిజనులకు ఇచ్చిన హామీలు కేవలం హామీలుగా మిగిలిపోకూడదని, ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, న్యాయం జరిగే వరకు ఆదివాసీ సమాఖ్య పోరాటం కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు.

# విశాఖ విమ్స్ లో ఘనంగా ప్రపంచ ట్రామా దినోత్సవం

* ఒక్క ఫోన్ కాల్ అమూల్యమైన ప్రాణానికి రక్షణ - ప్రమాద బాధితులకు అండగా నిలుద్దాం ప్రాణాలు కాపాడుదాం :విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వి మన్మధరావు

**విశాఖ తూర్పు,పెన్ పవర్, అక్టోబర్ 17:** ప్రపంచ ట్రామా దినోత్సవాన్ని శనివారం విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ లో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వి. మన్మధరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా "ఒక్క ఫోన్ కాల్... ఒక అమూల్యమైన ప్రాణానికి రక్షణ...! ప్రమాద బాధితులకు అండగా నిలుద్దాం... ప్రాణాలను కాపాడుదాం...!" అనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ప్రతి సంవత్సరం అక్టోబర్ 17న నిర్వహించే ప్రపంచ ట్రామా దినోత్సవం రోడ్డు ప్రమాదాలు, ఎత్తు నుంచి పడిపోవడం, పని ప్రదేశాల్లో ప్రమాదాల వల్ల కలిగే తీవ్రమైన గాయాలపై అవగాహన కల్పించడం, ప్రమాదాలను నివారించడం, క్షతగాత్రులకు సకాలంలో అత్యవసర వైద్యం అందించడం ప్రధాన లక్ష్యమని డాక్టర్ వి. మన్మధరావు తెలిపారు.ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంటను గోల్డెన్ అవర్ అంటారని, ఈ సమయంలో అత్యవసర వైద్యం అందించడం ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.ప్రమాదం జరిగినప్పుడు వెంటనే 108కు కాల్ చేయాలి, ప్రమాద స్థలాన్ని సురక్షితంగా ఉంచాలి, బాధితుడిని అనవసరంగా కదిలించకూడదు, రక్తస్రావం ఉంటే శుభ్రమైన గుడ్డతో ఒత్తిడి పెట్టాలి, బాధితుడి శ్వాసను గమనించాలి, సహాయం వచ్చే వరకు ధైర్యం చెప్పాలని సూచించారు. ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి భయపడవద్దని, భారతదేశంలో సద్భావంతో సహాయం చేసే వ్యక్తులకు చట్టపరమైన రక్షణలు ఉన్నాయని తెలిపారు. "నేను రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తాను, ప్రమాద బాధితులను నిర్లక్ష్యం చేయను, అత్యవసర పరిస్థితుల్లో 108కు కాల్ చేస్తాను" అని ఈ సందర్భంగా అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మిన్స్ట్రేటర్ డాక్టర్ మనోజ్ కుమార్, 108 సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.




# అక్రమ మద్యం విక్రయాలపై దాడులు.

## 20 లీటర్ల నాటుసారా,మరియు 13 మద్యం సీసాలు స్వాధీనం.



**కురుపాం అక్టోబర్ 17 పెన్ పవర్.** కురుపాం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి.శ్రీనివాసరావు.ఆధ్వర్యలో స్థానిక సంస్థల ఎన్నికల నియమావళి అమలు నేపద్యంలో భాగంగా అనధికార మద్యం విక్రయాలపై శనివారం నాడు జరిపిన దాడుల్లో వ్యక్తి అరెస్టు.ఈ మేరకు ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ,కురుపాం మండలం ప్రధాన రహదారికి అనుకుని ఉన్న టిఫిన్ షాఫ్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గెంబలి శ్రీధర్ ను అరెస్టు చేసి అతడి వద్ద నుండి 13మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసామన్నారు.అనంతరం కురుపాం మండలంలో గల బొడ్డమాను గూడ గ్రామంలో దాడులు నిర్వహించగా20లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అదే గ్రామానికి చెందిన ఆరిక జుజు పై కూడా కేసు నమోదు చేసామని శ్రీనివాసరావు తెలిపారు.గ్రామాలలో ఎవరైనా అనధికార మద్యం విక్రయించిన,బెల్ట్ షాపులు నిర్వహణకు వేలంపాటలు నిర్వహించిన,నాటు సారా తయారీ,రవాణా మరియు అమ్మకాలు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ దాడుల్లో కురుపాం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కిరాలేదు..

# ఆశావహులు సంయమనం పాటించాలి



* కూటమి టికెట్లపై ముందస్తు ప్రచారానికి బ్రేక్ వేయాలి
* అధిష్ఠానం నిర్ణయమే అభ్యర్థుల ఎంపికకు ప్రామాణికం

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, అక్టోబర్ 17:** స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల విషయంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమి మధ్య సీట్ల సర్దుబాటు ఇంకా పూర్తికాలేదని జనసేన పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఏపీ జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య స్పష్టం చేశారు. కూటమి టికెట్ తమకే ఖరారైందంటూ కొందరు ఆశావహులు ప్రచారం చేసుకోవడం సరికాదని, ఇలాంటి ప్రచారంతో మిత్రపక్షాల మధ్య అపోహలు, విభేదాలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలకు తమ అభ్యర్థిత్వాలు ఖరారైనట్లు ఎవరికి వారు ప్రచారం చేసుకోవడం కూటమి ఐక్యతకు విఘాతం కలిగిస్తుందని ఆయన హెచ్చరించారు. అభ్యర్థుల ఎంపికపై అధిష్ఠానం అధికారికంగా నిర్ణయం తీసుకున్న తర్వాతే ప్రకటన ఉంటుందని తెలిపారు. అప్పటివరకు ఆశావహులు సంయమనం పాటిస్తూ, ముందస్తు ప్రచారానికి దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పాడేరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులు అన్ని స్థానాల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో నాయకత్వం పనిచేస్తోందని గంగులయ్య పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.కూటమి మిత్రధర్మాన్ని గౌరవిస్తూ, అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలని, వ్యక్తిగత ప్రచారాలతో కూటమి ఐక్యతకు భంగం కలిగించవద్దని ఆయన కోరారు. "కూటమి ధర్మాన్ని పాటిద్దాం.. 100 శాతం స్ట్రైక్ రేట్ సాధనకు సహకరిద్దాం" అని పిలుపునిచ్చారు.

# టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలు.

కూటమి ప్రభుత్వ విధానాలు,సీఎం చంద్రబాబు నాయకత్వం నచ్చి టీడీపీలో చేరిక



**జియ్యమ్మ వలస అక్టోబర్ 17 పెన్ పవర్.** కురుపాం నియోజకవర్గ పరిధిలోగల జియ్యమ్మవలస మండలం,అంకవరం పంచాయతీ,అలమండ పంచాయతీ పరిధిలోగల పలు గ్రామాల వైసీపీ కుటుంబాలు శనివారం నాడు తెలుగుదేశం పార్టీలో చేరారు.ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంపై నమ్మకంతో పాటు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు,సిద్ధాంతాలు నచ్చి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు.పార్టీ అభివృద్ధికి,ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుకు తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ,అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దత్తి లక్ష్మణరావు,మండల కన్వీనర్ జోగి భుజంగరావు,వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్ట్ చైర్మన్ ఎం సత్యం నాయుడు,సొంటేనా శ్రీరామూర్తి,తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ హక్కుల కోసం ఆత్మగౌరవ నినాదం...



**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 17:**రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లోఉన్న చట్టాలకు విరుద్ధంగా 17అన్‌రిజర్వుడ్ ఎంపీటీసీ స్థానాలను కేటాయించడం ఆదివాసీ హక్కుల పరిరక్షణపై కుట్ర చేస్తునట్లు భావించాల్సి వస్తుందని, దీని మీద అనేక ప్రశ్నలు అనుమానాలు రేకెత్తిస్తుంది కూడ సుబ్రమణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆయా రాజకీయ పార్టీల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదివాసీ నాయకులు తమ జాతి హక్కుల పరిరక్షణకు బాధ్యత వహించాలనీ పార్టీ టికెట్ల కేటాయింపులో తమ పార్టీల కోసం నిరంతరం కష్టపడుతున్న, అర్హత కలిగిన ఆదివాసీ నాయకులకు ప్రాధాన్యత నిస్తూ అవకాశాలు కల్పించేటట్లు ఒత్తిడి తేవాలని,పార్టీ ప్రయోజనాల కోసం గిరిజన జాతి ప్రయోజనాలను పణంగా పెట్టకండనీ, పదవుల కోసం ఆదివాసీ హక్కులను తాకట్టు పెట్టకండనీ, జాతి మనుగడ కంటే రాజకీయ పదవులే ముఖ్యమని భావిస్తే, చరిత్ర ముందు జాతి ప్రయోజనాలను విస్మరించినవారిగా మిగిలిపోయే ప్రమాదం ఉందనీ గుర్తుంచుకోండనీ నాయకులకు పిలుపు నిచ్చారు.. మనకు అన్నం పెట్టే చేతులనే నరుక్కోవద్దనీ,మనకు గుర్తింపునిచ్చిన జాతి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టవద్దనీ,పార్టీలు వేరైనా.. మన జాతి ఒక్కటేనని, రాజకీయాలు వేరైనా.. మన హక్కులు ఒక్కటేనని, పదవులు శాశ్వతం కాదనీ, జాతి ప్రయోజనాలే శాశ్వతమని ఆదివాసీ నాయకులారా.. తస్మాత్ జాగ్రత్తని హెచ్చరించారు. మీ రాజకీయ భవిష్యత్తు కంటే మీ జాతి భవిష్యత్తే గొప్పదని గుర్తించుకోవాలని హితవు పలికారు.

## జి.మాడుగుల జడ్పీటీసీపై సిదరి రమ్య ఆశలు

- తండ్రి రాజకీయ వారసత్వంతో బరిలోకి యువత



**జి.మాడుగుల. పెన్ పవర్.అక్టోబర్ (17)**స్థానిక సంస్థల ఎన్నికల్లో జి.మాడుగుల జడ్పీటీసీ స్థానం మహిళకు రిజర్వు కావడంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని గెమ్మెలి పంచాయతీ మాజీ సర్పంచ్ సిదరి కొండబాబు తన కుమార్తె సిదరి రమ్యను జడ్పీటీసీ అభ్యర్థిగా బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ స్థానాన్ని ఆశిస్తున్నట్లు పార్టీ పెద్దలకు ఇప్పటికే వివరించినట్లు తెలిసింది. సిదరి కొండబాబు గతంలో వైకాపా తరఫున జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అయితే అప్పట్లో రాష్ట్ర పార్టీ పెద్దల సూచన మేరకు నామినేషన్ ఉపసంహరించుకున్నారు. వచ్చే ఎన్నికల్లో జడ్పీటీసీగా అవకాశం కల్పిస్తామని అప్పట్లో హామీ ఇచ్చినట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. ఈ క్రమంలో తాజా ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమల్లోకి రావడంతో తన కుమార్తెను రాజకీయాల్లోకి తీసుకువచ్చేందుకు కొండబాబు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. సిదరి రమ్య ఉన్నత విద్యావంతురాలు కావడం, యువత రాజకీయాల్లోకి రావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించాలనే అభిప్రాయంతో పలువురు ఆమె రాజకీయ ప్రవేశాన్ని స్వాగతిస్తున్నారు.
ఈ నేపథ్యంలో శనివారం సిదరి కొండబాబు తన కుమార్తె రమ్యతో కలిసి పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. జి.మాడుగుల జడ్పీటీసీ స్థానాన్ని ఆశిస్తున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. అయితే పార్టీ అభ్యర్థిత్వంపై తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది. మహిళా రిజర్వేషన్ నేపథ్యంలో జడ్పీటీసీ స్థానం కోసం ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తుండటంతో రానున్న రోజుల్లో మండల రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయి.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా బి. లక్ష్మీపతి బాధ్యతల స్వీకరణ



పెన్ పవర్ న్యూస్ --
**పద్మనాభం:**పద్మనాభం, అక్టోబర్ 17: పద్మనాభం మండలంలో సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు--2026 నిర్వహణలో భాగంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ (డీఆర్‌డీఏ) శ్రీ బి. లక్ష్మీపతి గారు రిటర్నింగ్ అధికారిగా నేడు బాధ్యతలు స్వీకరించారు.ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు రిటర్నింగ్ అధికారిగా ఆయన కీలక బాధ్యతలు నిర్వహించనున్నారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టనున్నారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ, సంబంధిత అధికారుల సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లనున్నారు.

# ఆరు దశాబ్దాల నిరీక్షణకు మహర్దశ

- అరకు మినీ రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు శరవేగం
- ఎంపీ డా. గుమ్మ తనుజా రాణి చొరవతో రూ.14 కోట్లతో పనులు




**పాడేరు పెన్ పవర్ :అక్టోబర్ 17:**అరకు ప్రాంత ప్రజల ఆరు దశాబ్దాల రైల్వే స్టేషన్ అభివృద్ధి సదుపాయల
కల ఎట్టకేలకు అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మ తనుజా రాణి చొరవతో సాకారమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి. అరకు వేలంగి ప్రాంతంలో నూతన మినీ రైల్వే స్టేషన్ (హాల్ట్ స్టేషన్) నిర్మాణ పనులు శర వేగంగాకొనసాగుతున్నాయి. సుమారు రూ.14 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రయాణికులతో పాటు పర్యాటకులు, టాక్సీ, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారులకుజీవన ఉపాధి అవకాశాలు మెండుగా అందుబాటులోకి రానున్నాయి.అరకు ప్రాంత ప్రజల రవాణా అవసరాలు, పర్యాటక రంగంపై ఆధారపడి జీవిస్తున్న స్థానికుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఎంపీ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి ఈ అంశాన్ని పలు మార్లు తీసుకెళ్లి సుదీర్ఘంగా చర్చలు జరిపి విజయం సాధించారు. ఈ క్రమంలోనే స్టేషన్ అభివృద్ధికి రూ.14 కోట్ల నిధులు మంజూరూ కాగా గత మార్చి నెలలో ప్రారంభమైన నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. స్టేషన్ భవనం, ప్లాట్‌ఫారమ్ తదితర మౌలిక సదుపాయాల కల్పనపై రైల్వే శాఖ ఎప్పటి కప్పుడు ప్రత్యేక దృష్టి సారిస్తూ ముందుకు పోతుంది.
పర్యాటకులకు మెరుగైన రవాణా.. స్థానికులకు ఉపాధి అవకాశాలు
అరకు ప్రకృతి అందాలను వీక్షించేందుకు నిత్యం తరలివచ్చే పర్యాటకులకు ఈ మినీ రైల్వే స్టేషన్ అందుబాటులోకి రావడం ద్వారా రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. రైలు ప్రయాణికుల రాకపోకలు పెరిగితే స్థానిక టాక్సీ, ఆటో డ్రైవర్లతో పాటు చిన్న వ్యాపారులకు కూడా ప్రయోజనం చేకూరనుంది. పర్యాటక రంగం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం లభించే అవకాశముంది.

**ప్రజా అవసరాలకు ప్రాధాన్యం**

గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణకు సంబంధించిన సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఎంపీ డా. గుమ్మ తనూజారాణి చొరవ ప్రాధాన్యత సంతరించుకుంది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రైల్వే సదుపాయాల అభివృద్ధి దిశగా చేపట్టిన ఈ నిర్మాణ పనులు పూర్తయి స్టేషన్ ప్రజలకు అందుబాటులోకి వస్తే అరకు ప్రాంత రవాణా వ్యవస్థలో కీలక మార్పుకు నాంది పలకనున్నాయి.ఆరు దశాబ్దాల ఆశలు.. అభివృద్ధి దిశగా కొత్త అడుగులు.. అరకు మినీ రైల్వే స్టేషన్ అందుబాటులోకి రావడంపై స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజా రాణి కు పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## నిన్నటి వరకు సర్పంచ్ నేడు జడ్పిటిసి చర్చిల్లోకి ఆమె పేరు.

### హుకుంపేట జడ్పిటిసి రేసులో ఆమె పేరు పరిశీలన.

### తండ్రి బాటలో ఆమె ప్రయాణం.



**హుకుంపేట పెన్ పవర్ అక్టోబర్ 16 :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండలం కేంద్రంలో నేడు జడ్పిటిసి అభ్యర్థుల హాట్ టాపిక్ గా మారింది.మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సమిడ రవిశంకర్ కుమార్తెకు జడ్పీటీసీ టికెట్ దక్కే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతుంది
హుకుంపేట: హుకుంపేట మండల జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో సమిడ వెంకట పూర్ణిమ పేరు రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంటోంది. మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సమిడ రవిశంకర్ కుమార్తెగా, తండ్రి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న నాయకురాలిగా పూర్ణిమకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అంతేకాకుండా హుకుంపేట పంచాయతీ సర్పంచ్ గా కూడా ఈమె కు అనుభవం ఉంది అంతేకాకుండా హుకుంపేట మండలంపై ఆమెకు మంచి పట్టు ఉందని రాజకీయ వర్గాల విశ్లేషణ. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆమె పనిచేస్తున్న పార్టీ అధిష్ఠానం ఆమె అభ్యర్థిత్వాన్ని పరిశీలించే అవకాశాలు ఉన్నాయనే చర్చ స్థానిక రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.
ఇప్పటికే అరకు నియోజకవర్గం ఆమె పనిచేస్తున్న పార్టీకు. మహిళా అధ్యక్షురాలు గా పార్టీ కు తన సేవలను అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు .గతంలో హుకుంపేట సర్పంచ్‌గా పనిచేసిన పూర్ణిమ గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ క్షేత్రస్థాయిలో పనిచేసిన అనుభవం ఆమెకు రాజకీయంగా బలాన్ని చేకూర్చే అంశంగా భావిస్తున్నారు. మరోవైపు, సమిడ రవిశంకర్‌కు ఉన్న రాజకీయ అనుభవం, కుటుంబ రాజకీయ నేపథ్యం, అలాగే పూర్ణిమకు చెందిన సామాజిక వర్గం నుంచి లభించే మద్దతు ఆమెకు అనుకూల అంశాలుగా చర్చకు వస్తున్నాయి. గతంలోనూ ఈ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు మండలంలో ప్రజాదరణ లభించిన నేపథ్యంలో, ఈసారి కూడా ఆ ఓటు సమీకరణాలు కీలకంగా మారవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
అధికార పార్టీ అభ్యర్థిని దీటుగా ఎదుర్కొనేందుకు ప్రజల్లో గుర్తింపు, క్షేత్రస్థాయి పరిచయాలు, రాజకీయ అనుభవం ఉన్న నాయకురాలిని ఎంపిక చేయాల్సిన అవసరం ఉందని కొందరు పార్టీ శ్రేణులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో సమిడ వెంకట పూర్ణిమ అభ్యర్థిత్వంపై పార్టీ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అనే రాజకీయ విశ్లేషకులుకు ఆసక్తికరంగా మారింది. జడ్పీటీసీ బరిలో పూర్ణిమకు అవకాశం దక్కుతుందా లేదా పార్టీ అధిష్ఠానం ఆమె వైపు మొగ్గు చూపుతుందా అనేది రానున్న రోజుల్లో స్పష్టత వచ్చే అంశం. అయితే, తుది అభ్యర్థి ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ పరిణామాలను రాజకీయ అంచనాలుగానే చూడాలి.
హుకుంపేట రాజకీయాల్లో సమిడ వెంకట పూర్ణిమ పేరు ఇప్పుడు రాజకీయ విశ్లేషకుల నోళ్ళల్లో నానుతుందనే. ప్రజల అభిప్రాయం

## జీకేవీధిలో పంచాయతీ పోరు షురూ.. రిజర్వేషన్లతో మారిన రాజకీయ సమీకరణాలు!




- 16 పంచాయతీల్లో 8 ఎస్టీ మహిళలకు.. మరో 8 ఎస్టీ జనరల్‌కు కేటాయింపు
- అభ్యర్థుల అన్వేషణలో రాజకీయ పార్టీలు.. తెరపైకి రానున్న కొత్త ముఖాలు!

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 17:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ క్రమంగా వేడెక్కుతోంది. ఇప్పటికే జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు కాగా, తాజాగా అధికారులు సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లను వెల్లడించడంతో గ్రామస్థాయి రాజకీయాల్లో కదలిక మొదలైంది. రిజర్వేషన్ల స్పష్టతతో ఆశావహులు తమ రాజకీయ భవిష్యత్తుపై అంచనాలు వేసుకుంటుండగా, అభ్యర్థుల ఎంపికపై రాజకీయ పార్టీలు దృష్టి సారిస్తున్నాయి.

**మహిళలకు రాజకీయ అవకాశాలు..**

గూడెంకొత్తవీధి మండలంలో మొత్తం 16 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో ఎనిమిది సర్పంచ్ స్థానాలను ఎస్టీ మహిళలకు, మరో ఎనిమిది స్థానాలను ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. దీంతో మహిళలకు ప్రత్యక్షంగా పోటీ చేసే అవకాశాలు విస్తరించాయి. ఎస్టీ జనరల్‌గా కేటాయించిన స్థానాల్లోనూ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన అభ్యర్థులు పోటీ చేసే అవకాశం ఉంటుంది. ఈ రిజర్వేషన్ల కూర్పు గ్రామస్థాయి నాయకత్వంలో కొత్త ముఖాలకు అవకాశం కల్పించడంతోపాటు, మహిళా నాయకత్వానికి ప్రాధాన్యం పెంచే పరిస్థితిని తీసుకొచ్చింది.

**అభ్యర్థుల ఎంపికపై పార్టీల కసరత్తు..**

రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఏ పంచాయతీలో ఎవరిని బరిలోకి దింపాలనే అంశంపై రాజకీయ పార్టీలు అంతర్గతంగా చర్చలు ప్రారంభించే పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో ప్రజాబలం, స్థానిక సమస్యలపై అవగాహన, కార్యకర్తలతో సంబంధాలు, ప్రజల్లో ఉన్న ఆదరణ వంటి అంశాలు అభ్యర్థుల ఎంపికలో కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో గ్రామస్థాయి సమస్యలపై స్పందించే నాయకులకు ప్రాధాన్యం లభించే అవకాశముంది.

**గెలుపు వ్యూహాలకు గ్రామాలే వేదిక!**

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలతోపాటు సర్పంచ్ ఎన్నికలపైనా రాజకీయ పార్టీలు దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని 16 పంచాయతీల్లో తమ పార్టీ తరఫున బలమైన అభ్యర్థులను ఎంపిక చేయడం, స్థానిక నాయకుల మధ్య సమన్వయం సాధించడం పార్టీలకు కీలకంగా మారనుంది. రిజర్వేషన్ల ప్రకటనతో ఆశావహుల రాజకీయ లెక్కలు మారుతుండగా, అభ్యర్థుల ఎంపికలో పార్టీలు తీసుకునే నిర్ణయాలు గ్రామాల్లో రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేయనున్నాయి. మొత్తంగా, గూడెంకొత్తవీధి మండలంలో రిజర్వేషన్ల ప్రకటన స్థానిక ఎన్నికల సందడికి మరింత ఊపునిచ్చింది. ఇప్పుడు అందరి దృష్టి అభ్యర్థుల ఎంపిక, పార్టీల వ్యూహాలు, గ్రామస్థాయిలో ఏర్పడే రాజకీయ సమీకరణాలపై కేంద్రీకృతమైంది. ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల ప్రక్రియపై స్పష్టత వచ్చిన కొద్దీ ఈ రాజకీయ వేడి మరింత పెరిగే అవకాశం ఉంది.

## అరకు పార్లమెంట్ పరిశీలకులకు మర్యాద పూర్వకంగా కలిసిన యువ నేత

పాడేరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి పై వివరణ



**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 17:**అరకు పార్లమెంట్ పరిశీలకులు తెదేపా సీనియర్ నేత మజ్జి చిన్న శ్రీను ను విజయనగరంలో తన నివాసంలో యువ నేత తెలుగు యువత రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసిన పుష్ప గుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల పై, పాడేరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి పై వివరణ ఇస్తూ చర్చించారు. తాను తెదేపా పార్టీలో పార్టీ పిలుపులు సూచ తప్పకుండా ఏ పిలుపు నైనా ముందుకు వెళ్లి కార్యసిద్ధి పూర్తి చేస్తున్నానని, కావున స్థానిక సంస్థల ఎన్నికల్లో పాడేరు మండలంలో జెడ్పీ టీసీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తే పోటీ చేసి గెలుస్తానని కోరారు. కాగా పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు మీడియాకు తెలిపారు. పార్టీ కోసం మరింత కృషి చేయాలని సూచించినట్లు యువ నేత మీడియాకు తెలిపారు. యువ నేత తో పాటు క్లస్టర్ ఇంచార్జీలు తామర మూర్తి బాబు , కొంతేలి వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

## అల్లూరి జిల్లా ఏపీ జి ఇ ఏ నూతన కార్యవర్గం అధ్యక్షునిగా మోరి మోహన్ బాబు ఏకగ్రీవ ఎన్నిక




**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 17:**ఏపీజిఇఏ రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్. సూర్యనారాయణ ఆదేశాల మేరకు శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఏపీజిఇఏ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగింది. ఎన్నికల అధికారిగా ఏపీజిఇఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డి. రాజశేఖర్ రెడ్డి , సహాయ ఎన్నికల అధికారిగా విశాఖపట్నం నగర అధ్యక్షులు జైతు రవీంద్రనాథ్ వ్యవహరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏపీజిఇఏ అధ్యక్షులుగా మోరి మోహన్ బాబును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు కార్యదర్శి గాపి. చిన్న సింహాచలం,అసోసియేట్ ప్రెసిడెంట్ బి. లక్ష్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. లీలావతికోశాధికారి
ఎస్. హరి, ఉపాధ్యక్షులుగా (7గురు) సభ్యులతో ఎన్నుకొన్నారు వారిలో పి. దినకర్ పాల్, బి. రవి,ఎస్. బాలకృష్ణ, ఓ. శాంతకుమారి,జి. రాజబాబు,ఎం. రవికుమార్, టి. ప్రవీణ్ పాడల్, జాయింట్ సెక్రటరీలుగా (7 గురు) సభ్యులతో ఎన్నుకొన్నారు వారిలో డి. రమేష్ బాబు, బి. భాస్కరరావు, ఎం. రత్నాకర్, పి. అశోక్ కుమార్, పి. మాధవరావు, పి. భవాని,కె. కోటిబాబు కార్యవర్గ సభ్యులుగా ఎం. బుల్లిబాబు,ఎస్. ప్రశాంత్,మన్మధరావు, వెంగళబాబు లను ఎన్నుకొన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులగా ఏపీజిఇఏ కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, విశాఖపట్నం ఉపాధ్యక్షులు ఎస్. శ్రీనివాసరావు హాజరయ్యారు.

# కళ్లివానిపాలెంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**ఆనందపురం, పెన్ పవర్ అక్టోబర్ 17 :**నవరాత్రుల సందర్భంగా ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ కళ్లివానిపాలెం గ్రామంలో కెవిపి సీజన్--1 క్రికెట్ టోర్నమెంట్‌ను కమిటీ సభ్యులు శనివారం ఉదయం ప్రారంభించారు. ఈ పోటీల్లో కెవిపి ఈగల్స్, కెవిపి హిట్టర్స్, కెవిపి వారియర్స్, కెవిపి పాంథర్స్ జట్లు పాల్గొంటున్నాయి.యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం గంభీరం పంచాయతీకి చెందిన జనసేన నాయకుడు చల్లా రామిరెడ్డి అలియాస్ సుబ్బు రూ.25 వేల విలువైన టీషర్ట్‌లను స్పాన్సర్ చేశారు. ప్రతి ఏడాది నవరాత్రుల సందర్భంగా ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, ఇటువంటి పోటీల ద్వారా యువతలో ఐక్యత, ఉత్సాహం, క్రీడాస్ఫూర్తి పెంపొందుతాయని చల్లా రామిరెడ్డి పేర్కొన్నారు. యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు మరిన్ని పోటీలు నిర్వహించాలని సూచించారు.



## కాసులమ్మ పై డి ఎల్ ఓవో శాశ్వత వేటు

- వైసీపీ గూటికి చేరిన ఆరోపణ నేపథ్యం




**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 17:**డి ఎల్ ఓవో కళ్లు గప్పి గుట్టు చప్పుడు కాకుండా వైసీపీ సమావేశాలకు హాజరు కావడం తెలియనట్లు మళ్ళీ డి ఎల్ ఓవో సమావేశాలకు హాజరు కావడం చేసేది.. నిర్ధారణ కావడంతో వైసీపీ గూటికి చేరిన ఆరోపణనిర్ధారణ కావడంతో కాసులమ్మ కు డి ఎల్ ఓవో నుండి శాశ్వతంగా బహిష్కరిస్తున్నట్లు డి ఎల్ ఓవో రాష్ట్ర కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఆదివాసీ హక్కుల కోసం ఆదివాసీ ఆత్మ గౌరవం కోసం డి ఎల్ ఓవో ఎప్పటికీ పని చేస్తుందని, ఆదివాసీ హక్కులు, ప్రయోజనాల కోసం పోరాడాల్సిన సంస్థ ను ద్రోహం చేసి వైసీపీ రాజకీయ ప్రయోజనాల కోసం పని చేసేందుకు వెళ్లిన కాసులమ్మ కు రాష్ట్ర కమిటీ శాశ్వతంగా బహిష్కరించేందుకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. డి ఎల్ ఓవో లో పని చేస్తు ఇటువంటి తప్పిదాలు చేస్తే ఎంతటి వారికైనా, ఎటువంటి హోదాలో ఉన్నా సరే ఈ నిర్ణయం తీసుకోవడంలో వెనుకడబోదని హెచ్చరించారు.

## జీకేవీధి జడ్పీటీసీ టికెట్ స్థానికులకే ఇవ్వాలి!

- కూటమిలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసికట్టుగా పనిచేస్తాం
- టీడీపీ నుంచి ఐదుగురు ఆశావహులు..



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 17:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలో జడ్పీటీసీ టికెట్ కోసం టీడీపీలో ఐదుగురు ఆశావహులు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈసారి స్థానిక మండలానికి చెందిన నాయకులకే అవకాశం కల్పించాలని ఆశావహులు కోరుతున్నట్లు సమాచారం.తెలుగు యువత మండల అధ్యక్షుడు ముర్లకోటి, దేవరపల్లి మాజీ సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు, రిటైర్డ్ వీఆర్వో ముర్ల సత్యనారాయణతో పాటు మరో ఇద్దరు టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.గత పదేళ్లుగా స్థానికేతరులకు అవకాశం కల్పిస్తున్నారనే అభిప్రాయంతో, ఈసారి గూడెంకొత్తవీధి మండలానికి చెందిన నాయకులకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆశావహులు కోరుతున్నట్లు సమాచారం. స్థానిక సమస్యలపై అవగాహన, ప్రజలతో సంబంధాలు ఉన్న వారికే అవకాశం కల్పించాలని పార్టీ అధిష్ఠానాన్ని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలుస్తోంది.అయితే, కూటమి తరఫున ఎవరికి టికెట్ కేటాయించినా పార్టీ నిర్ణయానికి కట్టుబడి, అభ్యర్థి విజయానికి సమష్టిగా కృషి చేస్తామని ఆశావహులు తెలిపినట్లు సమాచారం. స్థానికులకు అవకాశం కల్పించాలన్న డిమాండ్ నేపథ్యంలో జడ్పీటీసీ టికెట్ కేటాయింపుపై మండల రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# కూటమి అభ్యర్థిని గెలిపించండి



రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్

**నర్సీపట్నం, పెన్ పవర్ (అక్టోబర్ 17) :**నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థిగా ఎన్డీయే కూటమి బలపర్చిన చింతకాయల పద్మావతిని భారీ మెజార్టీతో గెలిపించాలని రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ పిలుపునిచ్చారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ, మంత్రి నారా లోకేష్ ల నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఎంతో ఐక్యంగా ముందుకు వెళ్తోందని స్పష్టం చేశారు. నర్సీపట్నంలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి, భవిష్యత్తులో చేయబోయే ప్రణాళికలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని విజయ్ విలేకరులకు చూపించారు. పద్మావతి గతంలో కౌన్సిలర్ గా ఉండి, ప్రజల సమస్యలపై అవగాహన ఉన్న నాయకురాలని, ఆమె చైర్ పర్సన్ అయితే నర్సీపట్నం రూపురేఖలు మారతాయని ధీమా వ్యక్తం చేశారు. అయ్యన్నపాత్రుడి కుటుంబం దశాబ్దాలుగా ప్రజల సేవలోనే ఉందని, 'అన్నపూర్ణ అక్షయపాత్ర' ద్వారా సుమారు లక్ష మందికి పైగా అన్నదానం చేశామని గుర్తుచేశారు. ఎంపీగా తన దృష్టికి వచ్చిన వెంటనే ఎంపీ నిధులు మంజూరు చేస్తున్నానని, గచ్చపు వీది కళ్యాణ మండపం, మినరల్ వాటర్ ప్లాంట్లు వంటివి ఏర్పాటు చేశామని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నర్సీపట్నంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, కనీసం రోడ్లు, డ్రైనేజీలు కూడా నిర్మించలేదని ఆయన విమర్శించారు. నాడు గంజాయి వ్యాపారాలు, టిక్కెట్ల అమ్మకాలతో కాలం గడిపిన వైసీపీ నాయకులకు, నేడు మున్సిపల్ ఎన్నికల్లో వార్డులకు అభ్యర్థులను నిలబెట్టే పరిస్థితి కూడా లేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపామని, అక్రమ కట్టడాలను ఉపేక్షించకుండా కూల్చివేస్తున్నామని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ నూరు శాతం 'స్ట్రైక్ రేట్' సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని విజయ్ తెలిపారు. జనసేన పార్టీ నర్సీపట్నం ఇంఛార్జిగా సూర్యచంద్ర ఉన్నారని, ఆయన పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. కేవలం రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే మంత్రి అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం అభివృద్ధి కోసం రూ. 267.70 కోట్ల నిధులు మంజూరు చేయించారని విజయ్ వివరించారు. అక్టోబర్ 28న జరిగే ఎన్నికల్లో ఓటర్లు సైకిల్ గుర్తుపై ఓటు వేసి చింతకాయల పద్మావతిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. రాబోయే రోజుల్లో నర్సీపట్నంలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా మెరుగుపరచి, భావితరాలకు ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దుతామని చింతకాయల విజయ్ హామీ ఇచ్చారు.

## నర్సీపట్నంలో జనసేన కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్లు



**నర్సీపట్నం, పెన్ పవర్ (అక్టోబర్ 17) :**నామినేషన్లు ప్రారంభమైన రెండవ రోజు కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో 8వ వార్డుకు అల్లాడ సురేష్, 11వ వార్డుకు పంచాడ హరినాథ్, 13వ వార్డుకు నందవరపు అలివేలు మంగ నామినేషన్లు దాఖలు చేశారు. ముందుగా ర్యాలీ నిర్వహించిన అభ్యర్థులు అనంతరం నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు చింతకాయల రాజేశ్, జనసేన నాయకుడు రాజాన వీరసూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతకాయల రాజేశ్ మాట్లాడుతూ కూటమి నిర్ణయించిన అభ్యర్థులే ఆయా వార్డుల్లో పోటీలో ఉంటారని, పెద్దల నిర్ణయం మేరకు సంబంధిత అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేస్తామని స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య సమన్వయంతో ఎన్నికల్లో ముందుకు సాగుతామని తెలిపారు. రాజాన సూర్యచంద్ర మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ధర్మాన్ని కాపాడుతూ, భాగస్వామ్య పార్టీల మధ్య ఐక్యతను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు ఊడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# ధ్యానంతోనే ఆత్మసాక్షాత్కారం



### గుదలంవీధిలో ఆత్మసత్య పిరమిడ్ వార్షికోత్సవం

**జి.మాడుగుల. పెన్ పవర్. (17)**ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవచ్చని హైదరాబాద్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ సురేష్, భీమసింగి పాకలపాటి గురుదేవుల ఆశ్రమ నిర్వాహకులు దేవి, రజిత తెలిపారు. పాకలపాటి గురుదేవుల ఆశీస్సులతో జి.మాడుగుల మండలంలోని గుదలంవీధి ధ్యాన సాధకుల ఆధ్వర్యంలో శనివారం ఆత్మసత్య పిరమిడ్ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పిరమిడ్ ధ్యానం ప్రాముఖ్యతను వివరించారు. పిరమిడ్ ఆకారంలో రూపొందించిన ప్రదేశంలో ప్రశాంతంగా కూర్చొని ధ్యానం చేయడం ద్వారా మనసును ఏకాగ్రతతో ఉంచుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ కొంత సమయం ధ్యానానికి కేటాయించడం వల్ల ఆలోచనల్లో స్పష్టత, భావోద్వేగాలపై నియంత్రణ, మానసిక ప్రశాంతత పెంపొందుతాయని వివరించారు. ధ్యానం ఆత్మపరిశీలనకు, ఆధ్యాత్మిక చింతనకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధ్యాన సాధకులు జి.చిన్నయ్య, జె.బలరాం, జె.గోవిందరావు, వి.రామకృష్ణ, జి.కృష్ణారావు వి.హరి , గ్రామస్తులు, ఆధ్యాత్మిక సాధకులు పాల్గొని ధ్యానం చేశారు. గురుదేవుల బోధనలను ఆచరిస్తూ ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు సాగాలని నిర్వాహకులు సూచించారు.

## హుకుంపేట జడ్పీటీసీ టికెట్‌పై సమిడ వెంకట పూర్ణిమ పేరు!

- వైసీపీ అభ్యర్థిత్వంపై రాజకీయ వర్గాల్లో చర్చ



**హుకుంపేట, పెన్ పవర్, అక్టోబర్ 17:** హుకుంపేట మండల జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో సమిడ వెంకట పూర్ణిమ పేరు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది. మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సమిడ రవిశంకర్ కుమార్తె అయిన పూర్ణిమకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున అవకాశం లభిస్తుందా అన్న అంశంపై స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం అరకు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా కొనసాగుతున్న పూర్ణిమ గతంలో హుకుంపేట సర్పంచ్‌గా పనిచేశారు. గ్రామస్థాయి పాలనలో అనుభవం, స్థానికంగా ప్రజలతో ఉన్న పరిచయాలు ఆమె రాజకీయ ప్రస్థానంలో ప్రస్తావనకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జడ్పీటీసీ అభ్యర్థిత్వం కోసం ఆమె పేరు పరిశీలనలోకి వచ్చే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.మరోవైపు, సమిడ రవిశంకర్‌కు ఉన్న రాజకీయ అనుభవం, కుటుంబ నేపథ్యం కూడా పూర్ణిమ అభ్యర్థిత్వంపై జరుగుతున్న చర్చలో ప్రస్తావనకు వస్తున్నాయి. అయితే, పార్టీ పరంగా అభ్యర్థుల ఎంపికలో స్థానిక రాజకీయ పరిస్థితులు, సామాజిక సమీకరణాలు, పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తదితర అంశాలు కీలకంగా ఉండనున్నాయి.జడ్పీటీసీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ప్రస్తుతం స్పష్టత లేని అంశం. సమిడ వెంకట పూర్ణిమకు అవకాశం లభిస్తుందా లేదా అన్నది పార్టీ అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే తేలనుంది.ప్రస్తుతం ఆమె పేరు రాజకీయ చర్చల్లో వినిపిస్తున్నప్పటికీ, అభ్యర్థిత్వం ఖరారైనట్లు అధికారిక సమాచారం లేదు. దీంతో హుకుంపేట జడ్పీటీసీ స్థానానికి సంబంధించి పార్టీ నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి కొనసాగుతోంది.

# అభివృద్ధికి అధికారం తోడైతే ప్రజాసేవలో ముందుంటా: కాకి గంగరాజు



**విశాఖ తూర్పు,పెన్ పవర్ అక్టోబర్ 17:** 14వ వార్డులో టీడీపీ అభ్యర్థి కాకి గంగరాజు ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహించారు.వార్డులోని గాంధీనగర్, శ్రీరామ్ నగర్, రవీంద్ర నగర్-2 ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తనకు అవకాశం ఇస్తే వార్డు సమస్యలను కౌన్సిల్ లో గట్టిగా వినిపించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ ప్రచారంలో వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.?

## అమ్మవారి ధారకొండలో 100 మంది సీపీఎం కార్యకర్తలు టీడీపీలో చేరారన్నది అవాస్తవం!

- సీపీఎం మండల నాయకుడు మూర్ల చంటిబాబు ఖండన..
- రోడ్లు, వంతెనల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 17:** గూడెంకొత్తవీధి మండలం అమ్మవారి ధారకొండ పంచాయతీకి చెందిన 100 మంది సీపీఎం కార్యకర్తలు టీడీపీలో చేరారంటూ వెలువడిన పత్రికా ప్రకటనలు వాస్తవం కాదని సీపీఎం మండల నాయకుడు మూర్ల చంటిబాబు ఖండించారు. అమ్మవారి ధారకొండ పంచాయతీలో సీపీఎం పార్టీ సభ్యులు కేవలం తొమ్మిది మంది మాత్రమే ఉన్నారని, అలాంటప్పుడు వంద మంది కార్యకర్తలు పార్టీలో చేరారంటూ ప్రకటించడం విడ్డూరంగా ఉందని అన్నారు. చేరినట్లు ప్రచారం జరుగుతున్న వ్యక్తులు సీపీఎం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నవారు కాదని, వారిలో పార్టీ సభ్యులు కూడా లేరని పేర్కొన్నారు.వ్యక్తిగత ప్రయోజనాల కోసం కొందరు పార్టీలు మారితే, వారిని సీపీఎం కార్యకర్తలుగా ప్రచారం చేయడం సరికాదన్నారు. రాజకీయ పార్టీల్లో చేరికల ప్రకటనలు చేసే ముందు సంబంధిత వ్యక్తుల వివరాలను నిర్ధారించుకోవాలని సూచించారు.అమ్మవారి ధారకొండ, గాలికొండ పంచాయతీల పరిధిలో రహదారులు, వంతెనలు లేక ప్రజలు దీర్ఘకాలంగా ఇబ్బందులు పడుతున్నారని చంటిబాబు తెలిపారు. గత ప్రభుత్వాల నుంచి ఇప్పటివరకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పందించి రహదారులు, వంతెనల నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.పార్టీ కండువాలు కప్పినంత మాత్రాన అభివృద్ధి జరగదని, ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

# 17వ వార్డు టీడీపీ అభ్యర్థి బుడుమూరి గోవింద్ నామినేషన్ దాఖలు



**కొత్తగా ఏర్పడిన వార్డులో ప్రచారం ముమ్మరం**

**విశాఖ తూర్పు,పెన్ పవర్ అక్టోబర్ 17:**విశాఖ తూర్పు నియోజకవర్గం పరిధిలో కొత్తగా ఏర్పడిన 17వ వార్డు (హనుమంతవాక, దీనదయాళపురం, కొండవాలు ప్రాంతాలు) నుంచి టీడీపీ బలపరిచిన అభ్యర్థి ముడుమూరి గోవింద్ నామినేషన్ దాఖలు చేశారు.

శుక్రవారం స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులతో కలిసి తూర్పు జోన్ జోనల్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు.

అనంతరం స్థానిక ప్రధాన ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. వార్డులోని మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కష్టపడిన నాయకులకే ప్రాధాన్యత ఇవ్వాలి.

- రాధికమ్మకు జడ్పిటిసి టికెట్ ఇవ్వాలని డిమాండ్!
- అరకు ఎమ్మెల్యే తనయుడు పై పార్టీ శ్రేణులు అందరు వ్యతిరేకం,



**అరకులోయ పెన్ పవర్ అక్టోబర్ 17:** కష్టపడిన నాయకులకు జడ్పీ టికెట్ కేటాయించకుండా అరకు ఎమ్మెల్యే మత్స్య లింగం తనయుడిని కేటాయిస్తే ఓటమి చవి చూడక తప్పదని అరకు వెల్లి మండల పార్టీ శ్రేణులు ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు, గతంలో నుండి కూడా చురుకైన పాత్ర పరిచయానికి మారుపేరు కొత్తభల్లుగుడ తాజా మాజీ సర్పంచ్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ విభాగం అధికార ప్రతినిధి కొర్రా . రాధికమ్మ కు అరకు జడ్పీ టికెట్ ఇస్తే గెలుపు తథ్యమని ప్రజలు పార్టీ శ్రేణులు కోరుతున్నారు,

పార్టీ ఆవిర్భావం నుండి గతంలో ఉన్న ఎమ్మెల్యే ఎంపీ, పార్టీ శ్రేణుల అడుగు జాడలు నడుస్తూ జగనన్న కు తోడుగా పార్టీ బలోపేతం కు సమిష్టిగా కృషి చేసిన ఆమె పై పార్టీ కేడర్ తో పాటు స్థానిక ప్రజలందరూ పార్టీ, కులా, మతాలకు అతీతంగా ఆమె నాయకత్వాన్ని బలపరుస్తున్నారు, ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే రేగం. మత్స్య లింగం సొంత మండలం హుకుంపేట అయినప్పటికీ ఆయన తనయుడిని అరకు మండల జడ్పిటిసి అభ్యర్థిగా తెరపైకి తీసుకురావడంతో పార్టీలో గ్రామస్థాయి నుండి దగ్గ మన్న విభేదాలు సంతరించుకుంది, పార్టీ ఆవిర్భావం నుండి జగనన్నకు తోడుగా నీడగా ఉండి పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేసిన కార్యకర్తలను ప్రజా ప్రతినిధులను ఎటువంటి అభిప్రాయాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని స్థానికేతర అయినా ఆయన తనయుడు చాణిక్య నీ అరకు జెడ్పిటిసి అభ్యర్థిగా ప్రయత్నం చేయడం దుర్మార్గమని స్థానిక మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, రాధికమ్మ ఆయన భర్త కొర్రా బలారాం అరుకు నియోజకవర్గంలోని పరిచయానికి మారుపేరు, గతంలో అరకులోయ (పెద్దలబు డు)మేజర్ పంచాయతీ లో రాధికమ్మ తాత క్రియాశీలకంగా రాజకీయ అరంగేట్రం చేసి రెండు పర్యాయాలు సర్పంచ్ గా ప్రజలకు స్వచ్ఛందంగా సేవలందించిన చరిత్ర ఆమెకు ఉంది, మొన్నటి వరకు ఆమె వివాహమాడిన కొత్త భల్లుగూడ పంచాయితీలో మొదటిసారి ప్రయత్నంలోనే సర్పంచ్ గా, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షురాలుగా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధికార ప్రతినిధిగా పదవులు చేపట్టినా అనుభవం ఆమె సొంతం చేసుకుని ఉంది, దీనికి తోడు ఆమె భర్త రాజకీయంగా ఎన్నో ఏళ్ల నుండి ప్రజలందరికీ సుపరిచితుడుగా మంచితనానికి మారు పేరు పొంది మచ్చలేని వ్యక్తిగా రాజకీయానికి ప్రజలందరినీ ఆయన వైపు మళ్లించుకునే ఓ నాయకుడిగా పేరు ప్రతిష్టాలు పొంది ఉన్నారు, అన్ని రకాలుగా సమర్ధురాలైన కొర్రా .రాధికమ్మను అధిష్టానం గుర్తించి జెడ్పిటిసి అభ్యర్థిగా ప్రకటిస్తే పార్టీలకు అతీతంగా కుల మతాలకు విభేదాలు లేకుండా గెలుపుకు తగ్గమవుతుందని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు, గతంలో నుండి కూడా సర్పంచ్ పదవిలో ఉన్నప్పటికీ అన్ని పంచాయితీలలో కూడా సేవా కార్యక్రమాలతో పాటు పార్టీ బలోపేతం కు సమిష్టిగా కృషి చేసిన ఒక మంచి మహిళ నాయకురాలుగా పేరు ప్రతిష్టాలు పొందారు, పార్టీ కోసం కష్టపడి పనిచేసినా నాయకత్వం రాధికమ్మను బలపరుస్తుంటే స్థానికేతరులకు టికెట్ ఇచ్చే పరిస్థితి వస్తే అరకులోయ జడ్పిటిసి అభ్యర్థి ఓటమి తప్పదని పలువురు అంటున్నారు, రాధిక (అమ్మ) బలరాం దంపతుల కుటుంబీకులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి విధేయులు:: పార్టీ ఆవిర్భావం నుండి ఈ దంపతుల బంధుత్వం పార్టీకు ఎంతో విధేయులుగా ఉంటూ పార్టీ బలోపేతంకు చురుకైన పాత్ర పోషించారు, మాజీ ఎంపీ గొట్టేడి మాధవి, మాజీ ఎమ్మెల్యే చిట్టి పాల్గుణ, వారితో విధేయులుగా ఉంటూనే వారి గెలుపు కు వారి అడుగుజాడలో నడుస్తూ ఎంతో పేరు ప్రఖ్యాతలు పొంది శభాష్ అనుకునేలా ప్రజల మననాలు పొందారు, వారి మంచి మనస్తత్వానికి జెడ్పిటిసి అభ్యర్థిగా అవకాశం ఇస్తే అరుకు స్థానం గెలుపు సాధ్యపడుతుందని ప్రజలు పలువురు కోరుతున్నారు, ఇప్పటికైనా అధిష్టానం ఆలోచన విధానాన్ని పునరాలోచన చేసి అన్ని కులాలు మతాలు కోరుకునే రాధికమ్మ నాయకత్వాన్ని బలపరచాలని, జెడ్పిటిసి టికెట్ పగ్గాలు ఆమెకు అవకాశం కల్పించాలని పార్టీలు కులాలు మతాలకు అతీతంగా ప్రజలు కోరుతున్నారు.

## 15 వ వార్డులో వైఎస్ఆర్సీపీ అభ్యర్థి నామినేషన్ దాఖలుప్రచారం ప్రారంభించిన మొల్లి హేమంత్



**విశాఖ తూర్పు పెన్ పవర్ అక్టోబర్ 17:**విశాఖ తూర్పు నియోజకవర్గం పరిధిలోని 15వ వార్డు నుంచి వైఎస్ఆర్సీపీ బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థి మొల్లి హేమంత్ శుక్రవారం తన నామినేషన్ దాఖలు చేశారు.నామినేషన్ కు ముందు వార్డు పార్టీ కార్యాలయం నుంచి ఆయన ప్రచారాన్ని ప్రారంభించారు.బాలాజీ నగర్, తోటగరువు, అంబేద్కర్ నగర్, ఎర్రి దుర్గా నగర్ పరిసర ప్రాంతాల మీదుగా ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, సత్తి మందారెడ్డి,బోర సూర్యనారాయణ, ఒమ్మి చిన్నారావు. సుజాత తదితరులు,వైఎస్ఆర్సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని అభ్యర్థి ఈ సందర్భంగా తెలిపారు.

# 72వ వార్డులో ధవళ గోపాల్‌కు ప్రజా నీరాజనం





- జనసేన అభ్యర్థి నామినేషన్‌కు భారీ స్పందన
- హోరెత్తిన జనసేన కండువాళ్ళతో బైక్ ర్యాలీ
- పూలవర్షం, యువత నినాదాలతో మార్మోగిన ప్రధాన వీధులు
- వార్డు అభివృద్ధే తన ధ్యేయమన్న ధవళ గోపాల్

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 17 :** పచ్చిమిర నియోజకవర్గం, జీవీఎంసీ 72వ వార్డు ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి ధవళ గోపాల్ నామినేషన్ కార్యక్రమం జనసందోహం, ఉత్సాహభరిత నినాదాల మధ్య ఘనంగా సాగింది. నామినేషన్ దాఖలు సందర్భంగా నిర్వహించిన భారీ బైక్ ర్యాలీకి స్థానిక ప్రజలు, యువత, మహిళలు, పార్టీ శ్రేణుల నుంచి విశేష స్పందన లభించింది. వార్డులోని ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీ జనసేన శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపగా, దారిపొడవునా ప్రజలు పూలవర్షం కురిపిస్తూ ధవళ గోపాల్‌కు ఘన స్వాగతం పలికారు. ధవళ గోపాల్ నామినేషన్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. బైక్ ర్యాలీ సాగిన మార్గంలో జనసేన జెండాలు రెపరెపలాడగా, యువత నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. స్థానికులు పూలమాలలు వేసి, పుష్పవర్షంతో స్వాగతం పలకడంతో ర్యాలీ సందడిగా సాగింది. ప్రజల నుంచి లభించిన ఈ ఆదరణతో 72వ వార్డులో ఎన్నికల సందడి మరింత ఊపందుకుంది. ప్రజల మధ్య సాగిన ఈ ర్యాలీ జనసేన శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ర్యాలీ అనంతరం ధవళ గోపాల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 72వ వార్డు ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలు, ఆదరణ తనకు ఎంతో సంతృప్తినిస్తున్నాయని తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. వార్డులో మౌలిక వసతుల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారం, ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యాలని ధవళ గోపాల్ స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లి ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో వార్డు అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని, ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి ప్రజాసేవకు అవకాశం కల్పించాలని ధవళ గోపాల్ విజ్ఞప్తి చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో బెహరా భాస్కరరావు, గునిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణతో పాటు పలువురు స్థానిక నాయకులు, జనసేన కార్యకర్తలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భారీ బైక్ ర్యాలీ, ప్రజల స్వాగతాలు, కార్యకర్తల ఉత్సాహం మధ్య ధవళ గోపాల్ నామినేషన్ కార్యక్రమం రాజకీయ సందడిని సంతరించుకుంది.

## 20 ఏళ్లుగా నిరంతర సేవలు..శోభన్ బాబు సేవా సంఘం ఆదర్శం!



- పద్మనాభనగర్‌లో ఘనంగా 20వ వార్షికోత్సవ వేడుకలు
- వెయ్యి మందికి భారీ అన్నదానం
- పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు అండగా సేవా కార్యక్రమాలు
- శోభన్ బాబు సంఘం అధ్యక్షులు నందవరపు సోములు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 17 :** సేవే లక్ష్యంగా, సమాజమే కుటుంబంగా భావిస్తూ శోభన్ బాబు సేవా సంఘం గత రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని సంఘం అధ్యక్షుడు నందవరపు సోములు అన్నారు. గ్రేటర్ విశాఖపట్నం జీవీఎంసీ పరిధిలోని 92వ వార్డు పద్మనాభనగర్‌లో శోభన్ బాబు సేవా సంఘం 20వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్గీయ నటభూషణ్ శోభన్ బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి సుమారు వెయ్యి మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నందవరపు సోములు మాట్లాడుతూ, తమ అభిమాన నటుడు శోభన్ బాబుపై ఉన్న అభిమానం, గౌరవంతో ఆయన పేరుమీద స్వచ్ఛంద సేవా సంఘాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గత 20 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలను నిరంతరాయంగా నిర్వహిస్తూ పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులు, అనాథాశ్రమాల్లోని విద్యార్థులు, కుష్టు వ్యాధి బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నామని వివరించారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో మానవత్వం, సేవాభావం పెంపొందించడమే తమ సంఘం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు చందు సుబ్బారావు మాట్లాడుతూ, తమ సంఘం కేవలం అన్నదానం, పేదలకు సహాయం చేయడానికే పరిమితం కాకుండా సమాజ అభివృద్ధిలోనూ భాగస్వామిగా నిలుస్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. జల సంరక్షణ ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేందుకు ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎయిడ్స్, కుష్టు వ్యాధుల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తూ సామాజిక ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రజల్లో సేవాభావం, పర్యావరణ స్పృహ, ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు తమ వంతు ప్రయత్నం కొనసాగిస్తామని తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి గోరకల రామదాసు మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా సంఘం ద్వారా నిర్వహించిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా సంఘానికి, అధ్యక్షుడు నందవరపు సోములుకు పలు పురస్కారాలు లభించాయని పేర్కొన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన ఉగాది పురస్కారంతో నందవరపు సోములును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సత్కరించడం శోభన్ బాబు అభిమానులందరికీ ఎంతో గర్వకారణమని అన్నారు. ఈ పురస్కారం సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి పేదలకు, నిరుపేద విద్యార్థులకు, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తామని వెల్లడించారు. 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడుతున్న శోభన్ బాబు సేవా సంఘం సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో గోరపల్లి బంగార్రాజు, కొంతం నూక రాజేశ్వరరావు, కంపర అప్పారావు, అండి బోయిన శ్రీనివాస్, మిద్ది అప్పారావు, తాండ్రంగి రామారావు, అల్లు నారాయణరావు, ఎం.ఎన్.వి. శ్రీనివాస్, కే. వెంకట్, కంచిపాటి వెంకటరమణ, కంపర నర్సింగరావు, కంచిపాటి నాగరాజు, డి.ఎస్. నాయుడు, సాలాపు శ్రీనివాసరావు, కట్ట పెంటయ్య తదితర శోభన్ బాబు అభిమానులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల వేళ రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

**ఎన్నికల్లో గొడవలు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు**



**నర్సీపట్నం, పెన్ పవర్ (అక్టోబర్ 17) :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు నర్సీపట్నం టౌన్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని రౌడీషీటర్లకు టౌన్ సిఐ గఫూర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, దాడులు, బెదిరింపులకు పాల్పడవద్దని పోలీసులు స్పష్టం చేశారు. గుంపులుగా చేరి శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, రాజకీయ పార్టీల మధ్య ఘర్షణలకు కారణమవడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఓటర్లను ప్రభావితం చేయడం లేదా ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ నిరంతరం నిఘా ఉంచుతుందని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పోలీసులు కోరారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీసు శాఖకు ప్రజలు సిఐ గఫూర్ విజ్ఞప్తి చేశారు.

## 15వ వార్డు టీడీపీ అభ్యర్థిగా ఒమ్మి అప్పలరాజు నామినేషన్ దాఖలు

**ప్రచారం ప్రారంభించిన అభ్యర్థి**



**విశాఖ తూర్పు పెన్ పవర్ అక్టోబర్ 17:** విశాఖ తూర్పు నియోజకవర్గం పరిధిలోని 15వ వార్డు నుంచి టీడీపీ బలపరిచిన అభ్యర్థి ఒమ్మి అప్పలరాజు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. జీవీఎంసీ ఎన్నికల్లో భాగంగా తన నామినేషన్ అనంతరం ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. తొటగరువు, బాలాజీ నగర్, రాజీవ్ నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు.

ఈ కార్యక్రమంలో 16వ వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు. స్థానిక నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.వార్డులోని మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అభ్యర్థి ఈ సందర్భంగా తెలిపారు.

## చిట్టపులి మహేశ్వరి కి వైసీపీ అధిష్టానం నుండి వర్తమానం..?

**నేడు జి.మాడుగుల జడ్పిటిసిగా ప్రకటించే అవకాశం..**




**జి.మాడుగుల,పెన్ పవర్.అక్టోబర్ (17)**స్థానిక సంస్థల ఎన్నికలు రోజురోజుకు వేడెక్కుతున్న తరుణంలో ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించడంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా జి.మాడుగుల మండల వైసీపీ నుండి చిట్టపులి మహేశ్వరి పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఈమె భర్త తాజా మాజీ సర్పంచ్ . గత రెండు పర్యాయాలు సర్పంచిగా పనిచేయడంతో పాటు. వైసీపీలో మంచి పట్టున్న నాయకుడిగా గుర్తింపు ఉంది. ఈయన పార్టీ ఆవిర్భావం నుండి వైసీపీలోనే పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వస్తున్నారు, గత ఎన్నికల్లో జీ. మాడుగుల జడ్పిటిసి గెలుపుకు ప్రధాన భూమిక పోషించారు. దీంతోపాటు ఈయనకు ఉమ్మడి విశాఖ జిల్లా వైసిపి నాయకులతో పరిచయాలు ఉండడం కలిసి వచ్చే అవకాశం ఉందని నమ్మకం. వీరికి మండలంలో అన్ని సిగ్మెంట్లో పూర్తి మద్దతు లభిస్తుంది. దీంతో ఈమెకు వైసీపీ అధిష్టానం నుండి నేడు జరగబోయే టికెట్లు కేటాయింపులో ఈమెకే మొగ్గ చూపుతున్నట్లు సమాచారం అందినట్లు తెలిసింది. అలాగే జిల్లా అధ్యక్షులు పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు మాకే టికెట్ కేటా ఇస్తారని పూర్తి విశ్వాసం ఉందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మహేశ్వరికి నేడు జరగబోయే టికెట్ల పంపిణీలో జడ్పిటిసి ప్రకటిస్తారో లేదో వేసి చూడాలి.

# ఎన్నికల ఫిర్యాదులపై నిరంతర పర్యవేక్షణ

డి ఆర్వో భాస్కర్ రెడ్డి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 17:** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా వచ్చే ఫిర్యాదులను నమోదు చేసి, వాటి పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి కంట్రోల్ రూమ్ విధులకు కేటాయించిన సిబ్బందితో సమావేశం నిర్వహించి, విధుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు పనిచేస్తుందని, ఫిర్యాదుల స్వీకరణ, నమోదు, సంబంధిత అధికారులకు సమాచారం చేరవేత, పరిష్కార పురోగతిపై పర్యవేక్షణ బాధ్యతలను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదుదారుల పేరు, చిరునామా, ఫోన్ నంబర్, ఫిర్యాదు అందిన తేదీ, సమయం తదితర వివరాలను రిజిస్టర్‌లో స్పష్టంగా నమోదు చేసి, వెంటనే కంట్రోల్ రూమ్ ఇన్‌ఛార్జి అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

సంబంధిత రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించారు. సిబ్బంది తమకు కేటాయించిన షిఫ్టుల ప్రకారం విధులకు హాజరుకావాలని, విధుల లో మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, ఆదేశాలను ఉల్లంఘించినా నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కంట్రోల్ రూమ్ నిర్వహణకు నోడల్ అధికారిగా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్. సుభాషిణిని నియమించగా, కలెక్టరేట్ పీజీఆర్ఎస్ డిప్యూటీ తహసీల్దార్ హెచ్. శ్రీరామ్ సహకరించ నున్నారు. కంట్రోల్ రూమ్ సిబ్బందికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రెండో షిఫ్ట్, రాత్రి 10 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు మూడో షిఫ్టులలో విధులు కేటాయిం చారు. ఎన్నికల కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్: 08832-944455

# నగరపాలక ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలి

✷ కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 17:** నగరపాలక ఎన్నికల నోటిఫికేషన్ ఏక్షణంలో వచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉండాలని కమిషనర్ రాహుల్ మీనా పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ నందు వార్డు సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత తక్కువ సమయంలోనే ప్రక్రియ పూర్తిచేయవలసి ఉంటుందని, ముందస్తుగానే ఏర్పాట్లు పూర్తి చేసుకోవలసిందిగా సూచించారు. నోటిఫికేషన్‌కు ముందే అవసరమైన పనులు చేపడితే ఎన్నికల సమయంలో ఇబ్బందులు తగ్గుతాయని, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిర్దేశకాలపై అధికారులు, ఉద్యోగులు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. పునర్విభజన జరిగిన వార్డుల వారీగా ఇంటింటికి తిరిగి పక్కా ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలన్నారు. వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను గుర్తించాలన్నారు. బ్యాలెట్ పెట్టెల ద్వారా ఎన్నికలు జరగనున్నందున ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎన్నికల సన్నద్ధతలో భాగంగా నగరంలో పోలింగ్ స్టేషన్లను గుర్తించడంతో పాటు వాటిలో మౌలిక వసతులు కల్పించవలసి ఉందని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. ప్రతి పోలింగ్‌బూత్‌లో 1000 మంది ఓటర్లు ఉండేలా చూడాలని, ప్రతి ఓటరు నివాసం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల విద్య, ఉన్నత విద్య, పురపాలక శాఖ పాఠశాలలతో పాటు ప్రభుత్వ భవనాలు, వార్డు సచివాలయాలు, వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాల్లో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో అధికారులు దృష్టి సారించాలన్నారు. ఓటర్లకు అసౌకర్యం కలగకుండా చూడాల న్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపుల నిర్మాణం తప్పనిసరిగా చేపట్టాలని, విద్యుత్ సౌకర్యంతో పాటు ఫ్యాన్లు, ఫర్నిచర్, తాగునీరు, టాయిలెట్లు ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో, అనంతరం చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సమీక్షలో సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# జగ్గంపేట అసెంబ్లీ స్థానిక ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా మహిపాల గణేష్.



**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 17:-** కాకినాడ పార్లమెంట్ పరిధిలో జగ్గంపేట నియోజకవర్గ స్థానిక ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ లో నిర్వాహకదళ్ సభ్యులుగా గోకవరం జనసైనికుడు మహిపాల వీర వెంకట సత్య నారాయణ(గణేష్) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈసందర్భంగా మహిపాల గణేష్ మాట్లాడుతూ సాధారణ కర్యకర్తకు జనసేన పార్టీ ఇంతటి సముచిత స్థానం కల్పిస్తుందని ఊహించనే లేదని పార్టీ కోసం కష్టపడి పనిచేశానే తప్ప ఏనాడు పదవుల కోసం చూడలేదన్నారు. అయినప్పటికీ జనసేన పార్టీ నన్ను గుర్తించి, ఇంతటి బాధ్యతను తనకు అప్పగించడం చాలా సంతోషకరంగా ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ కు, జగ్గంపేట జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ నాయకులను, కార్యకర్తలను కలుపుకుని గ్రామీణ స్థాయిలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా మహిపాల వీర వెంకట సత్యనారాయణ (గణేష్) తెలిపారు.

# అగ్నివీర్ నియామక ర్యాలీని అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలి

## భారత సైన్యంలో సేవలందించే అవకాశాన్ని యువత వినియోగించుకోవాలి: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**పెన్ పవర్ -- భీమవరం । అక్టోబర్ 17:** భీమవరం, అక్టోబర్ 17: భారత సైన్యంలో అగ్నివీర్‌గా చేరాలనుకునే అర్హులైన యువత హైదరాబాద్‌లోని ఆర్టిలరీ సెంటర్‌లో నిర్వహించనున్న యూనిట్ హెడ్‌క్వార్టర్స్ కోటా నియామక ర్యాలీని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. 2026 నవంబర్ 25 నుంచి డిసెంబర్ 6 వరకు ఈ నియామక ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. యుద్ధంలో మరణించిన సైనికుల భార్యల కుమారులు, మాజీ సైనికుల పిల్లలు, ప్రస్తుతం సైన్యంలో పనిచేస్తున్న సైనికుల పిల్లలు, సైనికులు, మాజీ సైనికుల సోదరులు, నిర్దేశిత అర్హతలు కలిగిన క్రీడాకారులు తదితర అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలకు అనుగుణంగా ఈ నియామక ప్రక్రియలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

**పలు విభాగాల్లో నియామకాలు**

అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ విభాగాల్లో నియామకాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత పోస్టులకు నిర్దేశించిన వయోపరిమితి, విద్యార్హతలు, ఇతర అర్హతలను ముందుగానే పరిశీలించుకోవాలని సూచించారు. నియామక ప్రక్రియలో భాగంగా శారీరక దారుఢ్య పరీక్షలు, శారీరక కొలతల పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు తదితర దశలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, వయస్సు, ఇతర అర్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని, నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

**దళారులను నమ్మి మోసపోవద్దు**

సైన్యంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మవద్దని జిల్లా కలెక్టర్ యువతకు సూచించారు. నియామకాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అధికారిక ప్రకటనల్లో పేర్కొన్న సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపారు.

# అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీలు

- ✷ సహజ ప్రసవాలు తక్కువగా జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన డాక్టర్ ఎం. రవిబాబు
- ✷ గర్భిణులు, చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశం
- ✷ మందుల నిల్వలు, సిబ్బంది హాజరు, వైద్య రికార్డుల పరిశీలన
- ✷ ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచన



**అత్తిలి, పెన్ పవర్ అక్టోబర్ 17:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు గర్భిణీ స్త్రీలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. రవిబాబు వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, మందుల నిల్వలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

**సహజ ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలి**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సహజ ప్రసవాల సంఖ్య తక్కువగా ఉండటంపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం. రవిబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలపై అవగాహన కల్పించడంతో పాటు సురక్షిత ప్రసవాలకు అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచనలు చేశారు.

**గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**

ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న వైద్య సేవల గురించి జిల్లా వైద్యాధికారి ఆరా తీశారు. గర్భిణులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా చిన్నారులకు అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలు తీరును సమీక్షించారు. చిన్నారులకు నిర్ణీత సమయాల్లో టీకాలు అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

**మందుల నిల్వలు, రికార్డుల పరిశీలన**

ఆసుపత్రిలో సిబ్బంది హాజరు పట్టికలు, వైద్య రికార్డులను జిల్లా వైద్యాధికారి పరిశీలించారు. విధుల నిర్వహణలో సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మందులు సరిపడా అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాన్ని ఫార్మాసిస్ట్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మందుల కొరత ఏర్పడకుండా నిల్వల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**ఆసుపత్రి పరిశుభ్రతపై నిర్లక్ష్యం వద్దు**

ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన జిల్లా వైద్యాధికారి పరిశుభ్రత నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఆసుపత్రి ప్రాంగణం, రోగుల చికిత్స గదులు, ఇతర విభాగాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని వైద్యాధికారి డాక్టర్ కె. నాగరాజుకు సూచించారు. రోగులకు ఆరోగ్యకరమైన వాతావరణంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా మాతా శిశు సంరక్షణ సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రజలకు అందుతున్న వైద్య సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె. నాగరాజు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వాహన్ , సారథి ఆన్‌లైన్‌లో 86 సేవలు రవాణా శాఖ సేవలు



**జిల్లా రవాణా శాఖాధికారి ఆర్. సురేష్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్,అక్టోబర్ 16:** ప్రజలకు వేగవంతమైన, పారదర్శక రవాణా శాఖ సేవలను అందించేందుకు 'వాహన్', 'సారథి' (ఎన్ఐసీ) పోర్టళ్ల ద్వారా 86 సేవలను ఆన్‌లైన్‌లో అందుబా టులోకి వచ్చినట్లు తూర్పు గోదావరి జిల్లా రవాణా శాఖాధికారి ఆర్. సురేష్ తెలిపారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, అర్హతను బట్టి ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని సేవలు పొందవచ్చనన్నారు.

వాహన యాజమాన్య హక్కుల బదిలీ, ఫైనాన్స్ నోటింగ్, ఫైనాన్స్ టెర్మినేషన్ వంటి వాహన సేవలతోపాటు, లెర్నర్ లైసెన్స్ (ఎల్ఎల్ఆర్), డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ, చిరునామా మార్పు తదితర సేవలకు అధికారిక పోర్టళ్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నిబంధనల ప్రకారం ఓటీపీ ధ్రువీకరణ, ఆన్‌లైన్ రుసుము చెల్లింపు లు చేసి సేవలు పొందవచ్చున్నారు. ఇంటి నుంచే లెర్నర్ లైసెన్స్ పరీక్షకు హాజరయ్యే వెసులుబాటు ఉందని వివరించారు. వాహన బదిలీ, ఫైనాన్స్ నోటింగ్, ఫైనాన్స్ టెర్మినేషన్ ప్రక్రియలను ఆటో అప్రూవల్ విధానంలోకి తీసుకురా వడానికి సాంకేతిక నవీకరణలు చేపడుతు న్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి తెలిపారు. ఆన్‌లైన్ సేవల ఆమోద ప్రక్రియలో ఆలస్యం జరుగుతున్నందున, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అక్టోబర్ 16 నుంచి రవాణా శాఖ కార్యాలయంలో సేవలకు ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో ఆలస్యమవుతున్న వాహనదారులు కార్యాలయాన్ని సంప్రదించి అవసరమైన మార్పులు, రుసుముల చెల్లింపులు పూర్తి చేసుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్ కోసం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో మాన్యువల్ డ్రైవింగ్ ట్రాక్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం లైసెన్స్ జారీ చేపడతామని, ఉత్తీర్ణత సాధించని వారు తిరిగి స్లాట్ బుక్ చేసుకొని పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుందని వివరించారు. భవిష్యత్తులో పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకురావడానికి ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. రవాణా శాఖ సేవలను ప్రజలు అధికారిక ఆన్‌లైన్ పోర్టళ్ల మీ-సేవ, కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్సీ) ద్వారా పొందాలని జిల్లా రవాణా శాఖాధికారి సూచించారు. ప్రభుత్వ నిర్ణీత రుసుములు చెల్లించాలని, కార్యాలయం పేరుతో అదనపు మొత్తాలు వసూలు చేసే మధ్యవర్తులు, దళారులను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. సేవలు పొందడంలో సమస్యలు , సందేహాలున్నా వేధింపులకు గురైనా జిల్లా రవాణా శాఖాధికారిని సంప్రదించవచ్చని తెలిపారు.

# ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు!

- ఎన్నికల బాధ్యతలను చట్టబద్ధమైన కర్తవ్యంగా భావించాలి
- ఏజెన్సీ ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ
- రెవెన్యూ, పోలీస్ శాఖల మధ్య పటిష్ట సమన్వయం అవసరం
- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టీకరణ




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 17:**స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు ఏమాత్రం అలసత్వం వహించినా కఠిన చర్యలు తప్పవని పోలవరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్ హెచ్చరించారు. ఎన్నికల విధులను చట్టబద్ధమైన బాధ్యతగా భావించి ప్రతి అధికారి సమర్థవంతంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులకు తొలుత షోకాజ్ నోటీసులు జారీ చేసి, అనంతరం ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం రంపచోడవరంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణా సమావేశంలో జిల్లా ఎస్పీ కె. చక్రవర్తితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి

స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు తమ బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేస్తూ ప్రతి దశలో పారదర్శకత పాటించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో సివిల్ అడ్మినిస్ట్రేషన్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్ అధికారుల మధ్య నిరంతర సమాచార మార్పిడి జరగాలని ఆదేశించారు.

### నామినేషన్ల పరిశీలనలో నిబంధనలు పాటించాలి

రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వోలు) ఎన్నికల ప్రక్రియలో తమ పాత్రలు, బాధ్యతలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఆమోదం, తిరస్కరణ వంటి అంశాల్లో ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. నిర్ణీత గడువుల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని, ఎటువంటి వివాదాలకు తావులేకుండా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

### ఏజెన్సీ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో ఎన్నికల నిర్వహణ సవాళ్లతో కూడుకున్నదని కలెక్టర్ పేర్కొన్నారు. భౌగోళిక పరిస్థితులు, రవాణా సౌకర్యాల కొరత, సమయ పరిమితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు (ఎఫ్ఎస్టీ), స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు (ఎస్ఎస్టీ), రూట్ అధికారులు, జోనల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసుకోవాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

### పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ఆదేశాలు

ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్లు తదితర కనీస మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### సమస్యలు తలెత్తకముందే అప్రమత్తం కావాలి: జిల్లా ఎస్పీ

ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్న తర్వాత స్పందించడం కంటే ముందస్తు సమాచారంతో వాటిని నివారించడమే ముఖ్యమని జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు తమ పరిధిలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పోలీస్ శాఖతో సమాచారాన్ని పంచుకోవాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన భద్రతా చర్యలు చేపట్టడం ద్వారా ప్రశాంత ఎన్నికల నిర్వహణ సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక అవసరమని స్పష్టం చేశారు.

### చీకటి పడకముందే ఎన్నికల సామగ్రి తరలింపు

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో సమయపాలన అత్యంత కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. మారుమూల గ్రామాల్లో పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రిని నిర్దేశిత కేంద్రాలకు సురక్షితంగా తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చీకటి పడకముందే మారుమూల ప్రాంతాల నుంచి సురక్షితంగా బయటకు వచ్చేలా రవాణా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఇందుకోసం పోలీస్, రెవెన్యూ, ఎన్నికల అధికారుల మధ్య సమన్వయం తప్పనిసరని స్పష్టం చేశారు.

### ఎన్నికల శిక్షణపై అధికారులకు దిశానిర్దేశం

ఈ సమావేశంలో ఎన్నికల శిక్షణ ప్రణాళిక, అధికారుల విధులు, బాధ్యతలు, శిక్షణ షెడ్యూల్, ఎన్నికల సామగ్రి, శిక్షణా వేదికలు, ఇతర ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, సబ్ కలెక్టర్లు పృథ్వీ రాజ్ కుమార్, నరేంద్ర పడాల్, జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర్, జడ్పీ సీఈవో పురుషోత్తం, ఓ ఎస్ డి జావాళి ,సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ అష్రాఫ్ ఆలీ, జిల్లా అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, రూట్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటే లక్ష్యం!

- సూర్య ఘర్ పథకంతో విద్యుత్ బిల్లుల భారం తగ్గింపు
- సౌర విద్యుత్ వినియోగంతో పర్యావరణ పరిరక్షణ
- పథకం ప్రయోజనాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి
- పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 17:**పోలవరం జిల్లాలో ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయించి, ప్రజలకు సౌర విద్యుత్ ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకురావడమే సేవా సేతు అభియాన్ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్--ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం రంపచోడవరంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, ఓఎస్డీ జావలి, సబ్ కలెక్టర్లు పృథ్వీ రాజ్ కుమార్, నరేంద్ర పడాల్, డీఎస్పీ అస్రఫ్ ఆలీలతో కలిసి సేవా సేతు అభియాన్, పీఎం సూర్య ఘర్--ముఫ్త్ బిజ్లీ యోజన పథకానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

### విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చు

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. సౌర విద్యుత్ వినియోగం వల్ల కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం చేకూరడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు.

### అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం చేరాలి

సేవా సేతు అభియాన్ ద్వారా పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పథకం ప్రయోజనాలు, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు విధానం, అర్హతలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులు పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.

ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ద్వారా విద్యుత్ అవసరాలను తీర్చుకునేందుకు అవకాశం ఉంటుందని, ప్రజలు సౌర విద్యుత్ వినియోగం వైపు మొగ్గుచూపాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ అచ్చుతారావు, జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమ నిబంధనలు, ప్రవర్తనా నియమావళిపై

# సంపూర్ణ అవగాహనతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలి




**పెన్ పవర్ -- భీమవరం, అక్టోబర్ 17**గాఅధికారులకు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది ఎన్నికల నియమ నిబంధనలు, ప్రవర్తనా నియమావళిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, అత్యంత అప్రమత్తతతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. ఎన్నికల సమయంలో జిల్లాలో ఎక్కడ చిన్న సమస్య తలెత్తినా, అది మొత్తం ఎన్నికల నిర్వహణపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ సమన్వయంతో, జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. శనివారం భీమవరం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఎన్నికల విధుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ 3వ తేదీన పోలింగ్, నవంబర్ 5వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల విధుల నిర్వహణకు సుమారు 7,500 మంది సిబ్బంది అవసరమవుతారని తెలిపారు. విధులకు కేటాయించిన ప్రతి ఒక్కరికీ తమ బాధ్యతలపై స్పష్టమైన అవగాహన కల్పించేలా శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. గతంలో పలుమార్లు ఎన్నికల విధులు నిర్వహించిన అనుభవం ఉన్నప్పటికీ, ప్రతి ఎన్నికను ప్రత్యేకమైనదిగా భావించి మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నియమ నిబంధనలు, విధివిధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలు, అధికార పరిధి, అనుసరించాల్సిన విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. శిక్షణలో వివరించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకుని, క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు.

### ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రతి అధికారి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో సున్నితమైన అంశాలు, ప్రజల భావోద్వేగాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల సమయంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల ఏజెంట్లకు నిబంధనల ప్రకారం అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా తెలియజేయడంతోపాటు, ఎన్నికలకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.

### శిక్షణలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా వివరించాలి

ఎన్నికల విధులపై శిక్షణ అందించే ట్రైనర్లు ప్రతి నియమాన్ని, విధివిధానాన్ని స్పష్టంగా వివరించాలని కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాల్లో సంబంధిత మండల అధికారులు, ఎన్నికల విధులకు సంబంధించిన అధికారులు తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేసేలా పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

ఎన్నికల విధుల నిర్వహణలో ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. పోలింగ్ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ఎన్నికల ప్రక్రియలోని ప్రతి దశను నిబంధనలకు అనుగుణంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి, సిబ్బంది పూర్తి నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. గ్లోరియా, కేఆర్సీ డిప్యూటీ కలెక్టర్ పి. ప్రభాకర్, డీఆర్డీఏ పీడీ అప్పారావు, జిల్లా విద్యాశాఖ అధికారి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత

- దేవాలయాల ఆస్తుల పరిరక్షణ, పారదర్శక పాలనకు కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**పెన్ పవర్ । భీమవరం । అక్టోబర్ 17:**పశ్చిమ గోదావరి జిల్లాలోని దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ దేవాదాయ శాఖ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. జిల్లా ఎండోమెంట్ అధికారిగా నియమితులైన వి. వెంకటేశ్వరరావు శనివారం భీమవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ చదలవాడ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. వి. వెంకటేశ్వరరావు గతంలో కాకినాడ జిల్లాలో విధులు నిర్వహించగా, అక్కడి నుంచి భీమవరం జిల్లా ఎండోమెంట్ అధికారిగా బదిలీపై వచ్చారు. ఇంతకుముందు పశ్చిమ గోదావరి జిల్లా ఎండోమెంట్ అధికారిగా పనిచేసిన సూర్య ప్రకాష్, మావుళ్లమ్మ తల్లి ఆలయ కార్యనిర్వహణాధికారిగా బదిలీ అయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దేవాలయాల అభివృద్ధితో పాటు వాటి ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. దేవాదాయ శాఖలో పారదర్శకమైన పాలనకు ప్రాధాన్యతనిస్తూ, భక్తులకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

# శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకారంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు

- ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు
- ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు
- వేదమంత్రోచ్ఛారణల నడుమ విశేష పూజలు



**గంగవరం, అక్టోబర్ 17 (పెన్ పవర్):**దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గంగవరం గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన శనివారం అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీ దేవి రూపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దివ్య అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ఆలయ పురోహితులు శ్రీ వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. లోకకల్యాణం, సుఖశాంతులు, సిరిసంపదలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. మహాలక్ష్మీ దేవి రూపంలో దర్శనమిచ్చిన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.

### భక్తిపారవశ్యంలో అమ్మవారి ఆలయం

దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తిపూర్వక వాతావరణం నెలకొంది. జగన్మాతను వివిధ రూపాల్లో ఆరాధించడం ద్వారా అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ముఖ్యంగా శ్రీ మహాలక్ష్మీ దేవిని ఐశ్వర్యానికి, సౌభాగ్యానికి, సుఖసంతోషాలకు అధిష్ఠాన దేవతగా కొలుస్తారు. ఈ నేపథ్యంలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజలు ఆధ్యాత్మిక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

### సిరిసంపదలు ప్రసాదించే మహాలక్ష్మీ అమ్మవారు

శ్రీ మహాలక్ష్మీ దేవి అనుగ్రహంతో ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారిని వివిధ అలంకారాల్లో దర్శించుకోవడం పుణ్యప్రదమని భక్తులు విశ్వసిస్తారు. అమ్మవారి ఆరాధనతో సకల శుభాలు కలుగుతాయని ఆలయ పురోహితులు శ్రీ వెంకటేశ్వర శర్మ వివరించారు. దేవీ నవరాత్రి ఉత్సవాలతో గంగవరం గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకారంలో కొలువుదీరిన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దివ్య దర్శనం భక్తులకు ప్రత్యేక అనుభూతిని కలిగించింది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com